గురువారం
27-07-2023
విజయవాడ ప్రచురణ
సంపుటి : 72, సంచిక : 36
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from
Vijayawada, Hyderabad, Visakapatnam,
Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
# విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

**ప్రతికూల రాజకీయ పరిస్థితుల్లోనూ బలంగా ముందుకు: పీసీటీఈ**

రాజకీయ పరిస్థితులు అనుకూలంగా లేనప్పటికీ గతంలో కంటే మెరుగైన ప్రదర్శనను కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ది వర్కర్స్ ఆఫ్ స్పెయిన్ (పీసీటీఈ) ఇచ్చింది. ఓట్లను పెంచుకుంది. 2019తో పోల్చితే ఈసారి ఎన్నికలలో 73.52శాతం ఎక్కువ ఓట్లు సాధించింది.

2 లో

# కుంభవృష్టి

- పొంగుతున్న వాగులు, వంకలు
- కృష్ణానదికి భారీగా వరద
- మొత్తం 70 గేట్లు ఎత్తివేత
- 1.20 లక్షల క్యూసెక్కులు సముద్రంలోకి...
- గోదావరికి రెండో ప్రమాద హెచ్చరిక
- ఎడతెరపిలేని వర్షంతో ప్రజల ఇక్కట్లు

**విశాలాంధ్ర బ్యూరో - అమరావతి:**
రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో రాష్ట్రవ్యాప్తంగా వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. ఎక్కడికక్కడ రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. అటు గోదావరితో పాటు, ఇటు కృష్ణానది కూడా పరవళ్లు తొక్కుతోంది. గోదావరి నదికి రెండో ప్రమాద హెచ్చరిక జారీ కాగా, కృష్ణా నదికి వరద ఉధృతి గంట గంటకూ పెరుగుతోంది. మునేరు, కట్టలేరుతోపాటు చిన్నపాటి వాగులన్నీ పొంగి ప్రవహిస్తుండటంతో విజయవాడ ప్రకాశం బ్యారేజీ వద్ద మొత్తం 70 గేట్లు ఎత్తేశారు. సుమారు లక్షా 20వేల క్యూసెక్కుల నీటిని సముద్రంలోకి విడుదల చేశారు. ఈ సీజన్‌లో ప్రకాశం బ్యారేజీ నుంచి దిగువకు నీరు విడుదల చేయడం ఇదే మొదటిసారి. ఇక వరద ఉధృతి కారణంగా ముందు జాగ్రత్త చర్యగా కృష్ణాజిల్లాలో విద్యాసంస్థలకు సెలవు ప్రకటించారు. హంసలదీవి బీచ్ గేట్లు మూసేశారు. పర్యాటకుల రాకపోకలను పూర్తిగా నిషేధించారు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా మంగళవారం రాత్రి నుంచి బుధవారం రాత్రి వరకు ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో జనజీవనం పూర్తిగా స్తంభించింది. పట్టణ రహదారులన్నీ చెరువులయ్యాయి. విజయవాడలో బస్టాండ్ లోబ్రిడ్జి, ఒన్‌టౌన్‌లో బ్రిడ్జి సమీపంలో భారీగా నీరు చేరడంతో వాహనదారులు తీవ్ర అవస్థలు పడ్డారు. నగరంలోని అనేక ప్రాంతాలు జలమయమయ్యాయి. దీంతో ఎక్కడికక్కడ ట్రాఫిక్ స్థంభించడంతో వాహనదారుల ఇక్కట్లు వర్ణనాతీతం. ముంపు ప్రాంతాలైన కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో 23 గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. వేలేరుపాడు నుండి కోయిదా వెళ్లే ప్రధాన రహదారి వరద ముంపునకు గురై పూర్తిగా రాకపోకలు నిలిచిపోయాయి. బుట్టాయిగూడెం మండలంలో కొండవాగులు పొంగిపొర్లుతున్నాయి. జల్లేరు, బైనేరు వాగులు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో గిరిజనులు భయాందోళనలో ఉన్నారు. కామవరపుకోట మండలం కళ్లచెరువు, లింగపాలెం మండలం ఆసన్నగూడెం గ్రామాలను కలిపే గుండేరువాగు కొట్టుకుపోయింది. వారికున్న ఏకైక మార్గం కూడా వరద ఉధృతికి తెగిపోవడంతో ఆ గ్రామ ప్రజలకు ఎటూ పాలుపోని పరిస్థితి ఏర్పడింది. ఇక

- మిగతా 2 లో

# అవిశ్వాస అస్త్రం

**మణిపూర్‌పై మోదీ మాట్లాడటమే విపక్షాల లక్ష్యం**

**కాంగ్రెస్, బీఆర్ఎస్ నోటీసులు - చర్చకు స్పీకర్ అంగీకారం**

**అఖిలపక్షంతో చర్చించాకే తేదీ, సమయం ఖరారు: ఓంబిర్లా**

**న్యూఢిల్లీ:**
మణిపూర్‌పై నోరు విప్పని ప్రధాని మోదీతో ఎలాగైనా సరే పార్లమెంటులో ప్రకటన చేయించాలన్న సంకల్పంతో ప్రతిపక్ష పార్టీల కూటమి 'ఇండియా' దూకుడు పెంచింది. చివరి అస్త్రంగా ఎన్డీయే ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టింది. ఇండియా కూటమి తరపున కాంగ్రెస్ ఎంపీ గౌరవ్ గొగోయ్, భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) తరపున ఆ పార్టీ ఎంపీ నామా నాగేశ్వరరావు వేరుగా సంబంధిత నోటీసును స్పీకర్ ఓంబిర్లాకు అందజేశారు. వాటిని పరిశీలించిన సభాపతి అవిశ్వాస తీర్మానంపై చర్చకు అంగీకారం తెలిపారు. అఖిలపక్షంతో చర్చించిన తర్వాత దీనిపై చర్చకు తేదీ, సమయాన్ని ఖరారు చేస్తామని అన్నారు. గురువారం చర్చ తేదీని నిర్ణయించవచ్చని తెలిసింది. అయితే పార్లమెంటు వర్షాకాల సమావేశాలు ముగిసేందుకు 13రోజులే మిగిలివున్నాయి. నిబంధనల ప్రకారం అవిశ్వాస తీర్మానంపై పది రోజులలోపు చర్చను చేపట్టాల్సి ఉంటుంది. అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెడితే ప్రధాని మోదీ తప్పనిసరిగా పార్లమెంటులో మాట్లాడాలి. అంతేకాక అనేక అంశాలను లేవనెత్తే అవకాశం విపక్షాలకు లభిస్తుంది. ఇదే యోచనతో ఇండియా కూటమి ఆ దిశగా అడుగులు వేసింది. బీఆర్ఎస్ కూడా స్పీకర్‌కు నోటీసులిచ్చింది. కాంగ్రెస్, బీఆర్ఎస్ నోటీసులను పరిశీలించిన స్పీకర్ వాటికి ఎంత మంది మద్దతు ఉందని సభను ప్రశ్నించారు. దీంతో ఇండియా కూటమి తరపున కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీ, నేషనల్ కాన్ఫరెన్స్ అధ్యక్షుడు ఫరూక్ అబ్దుల్లా, డీఎంకే నేత టీఆర్ బాలూ, ఎన్‌సీపీ నేత సుప్రియా సూలేతో పాటు టీఎంసీ, సీపీఐ, సీపీఎం, శివసేన (ఉద్ధవ్ వర్గం), జేడీయూ, ఆప్ నేతలు తమ స్థానాల్లో నిలబడి తమ మద్దతును

- మిగతా 2 లో

# బాలికల అదృశ్యం వాస్తవమే

- లెక్కలతో వివరించిన కేంద్రం
- ఏపీ, తెలంగాణలో 72,767 మంది మిస్సింగ్

**విశాలాంధ్ర బ్యూరో- అమరావతి:**
ఏపీలో మహిళల అదృశ్యానికి సంబంధించి కొద్దిరోజులుగా చర్చ జరుగుతున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం బుధవారం పార్లమెంటు సాక్షిగా లెక్కలతో సహా ఎంతమంది కనిపించకుండా పోయారో తేల్చిచెప్పింది. జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఇటీవల ఈ వ్యవహారాన్ని వలంటీర్లకు లింక్ చేస్తూ విమర్శలు చేయడం రాష్ట్రంలో రాజకీయ దుమారం రేపింది. పవన్ కల్యాణ్ నిరాధారంగా తమపై ఆరోపణలు చేస్తున్నారని వైసీపీ నేతలు, మంత్రులు ఘాటుగా కౌంటర్లు ఇచ్చారు. చివరకు మహిళా కమిషన్ చైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ కూడా రంగంలో దిగి పవన్ కల్యాణ్‌కు షోకాజ్ నోటీసు జారీ చేశారు. పవన్ కల్యాణ్‌పై ఒకరిద్దరు వలంటీర్లు పోలీస్ స్టేషన్‌లో కేసు కూడా నమోదు చేశారు. కానీ మహిళల మిస్సింగ్ నిజమేనని కేంద్రం పార్లమెంటులోనే తేల్చేసింది. రాజ్యసభలో కొందరు సభ్యులు అడిగిన ప్రశ్నకు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి అజయ్ మిశ్రా లిఖితపూర్వక సమాధానమిచ్చారు. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో 2019 నుంచి 2021 మధ్య మహిళలు, బాలికల అదృశ్యంపై కేంద్ర హోంశాఖ వివరాలు వెల్లడించింది. ఇందులో రెండు తెలుగు రాష్ట్రాల్లో కలిపి 72,767 మంది అదృశ్యమైనట్లు పార్లమెంటుకు నివేదించింది. జాతీయ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో లెక్కల ప్రకారం తెలుగు రాష్ట్రాల్లో మహిళలు అదృశ్యమవుతున్న కేసులు ఏటేటా పెరుగుతున్నట్లు వెల్లడించింది. ఏపీలో 2019 నుంచి 2021 వరకు మొత్తం 7928 మంది బాలికలు, 22,278 మంది మహిళలు అదృశ్యమైనట్లు పేర్కొంది. 2019లో 2186 మంది బాలికలు, 6252 మంది మహిళలు, 2020లో 2374 మంది బాలికలు, 7057 మంది మహిళలు, 2021లో 3358 మంది బాలికలు, 8969 మంది మహిళలు అదృశ్యమైనట్లు కేసులు నమోదయ్యాయని పేర్కొంది. మరో తెలుగు రాష్ట్రం తెలంగాణలో సైతం మహిళలు, బాలికల మిస్సింగ్ కేసులు మరింత ఎక్కువగా ఉన్నట్లు హోంశాఖ గణాంకాలు వెల్లడించాయి. 2019 నుంచి 2021 వరకు తెలంగాణలో మొత్తం 8066 మంది బాలికలు, 34,495 మంది మహిళలు అదృశ్యమయ్యారు. ఇందులో 2019లో 2849 మంది బాలికలు, 10,744 మంది మహిళలు మిస్సయ్యారు. 2020లో 2232 మంది బాలికలు, 10,917 మంది మహిళలు అదృశ్యం కాగా.. 2021లో 2994 మంది బాలికలు, 12,834 మంది మహిళలు అదృశ్యమైనట్లు కేసులు నమోదయ్యాయని కేంద్రం తెలిపింది.

# మణిపూర్ ప్రజలకు అండగా ఉందాం

- ప్రధాని పార్లమెంటులో మాట్లాడాలి
- భిన్న సంస్కృతులున్న దేశంలో ఒకే చట్టం సాధ్యం కాదు
- సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ

**విశాలాంధ్ర-విజయవాడ :**
బీజేపీ దుర్మార్గాలకు బలవుతున్న మణిపూర్ ప్రజలకు భారతదేశం మొత్తం అండగా ఉండాలని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ పిలుపునిచ్చారు. మణిపూర్ రాష్ట్రం జాతుల మధ్య వైరం, మత విద్వేషాలతో అట్టుడుకుతున్న పరిస్థితుల్లో ప్రధాని నరేంద్ర మోదీ ఈ అంశాలపై పార్లమెంటులో మాట్లాడాలని డిమాండ్ చేశారు. మణిపూర్ మారణకాండను నిరసిస్తూ, గిరిజన మహిళలను నగ్నంగా ఊరేగించటాన్ని ఖండిస్తూ, ఆ రాష్ట్రంలో శాంతి భద్రతలను పరిరక్షించాలని కోరుతూ సీపీఐ విజయవాడ నగర సమితి అధ్వర్యంలో నిర్వహించిన సంఘీభావ సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. స్థానిక దాసరి భవన్‌లో బుధవారం సీపీఐ విజయవాడ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ ప్రధాని మోదీపై 'ఇండియా' కూటమి అవిశ్వాస తీర్మానం పెడుతుందని, దీనికి కూటమిలోని 26 రాజకీయ పార్టీలతో పాటు ఇతర పార్టీల మద్దతు

- మిగతా 2 లో

## ఇదీ లోకం!

# సీమ ద్రోహి జగన్

- ఒక్క జీవోతో 102 ప్రాజెక్టుల పనులు రద్దు
- రాయలసీమ రైతాంగానికి సీఎం క్షమాపణ చెప్పాలి
- చంద్రబాబు విమర్శలు

2 లో

ఈడీ అధిపతి పదవీకాలం పొడిగింపుపై

# మళ్లీ సుప్రీంకు కేంద్రం

**న్యూఢిల్లీ:**
ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) డైరెక్టర్ సంజయ్ మిశ్రా పదవీ కాలం పొడిగించాలని కోరుతూ మోదీ సర్కార్ బుధవారం మరోసారి సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఈ మేరకు తాజాగా సుప్రీంలో పిటిషన్ దాఖలు చేసింది. పదవీకాలం పొడిగింపు విషయంలో ఇదివరకు ఇచ్చిన ఆదేశాలను పునరాలోచించాలని కోరుతూ కేంద్రం తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా సుప్రీం కోర్టును కోరారు. గురువారం ఈ పిటిషన్‌ను లిస్ట్ చేసేందుకు జస్టిస్ గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం అంగీకరించింది. ఈడీ అధిపతిగా 2018 నవంబర్‌లో సంజయ్ కుమార్ మిశ్రా నియమితులయ్యారు. రెండేళ్ల తర్వాత (60 ఏళ్ల వయసు వచ్చిన) ఆయన పదవీ విరమణ చేయాల్సి ఉంది. కానీ, 2020 నవంబర్‌లో ఆయన పదవీ కాలాన్ని కేంద్ర ప్రభుత్వం పొడిగించింది. 2022లోనూ మూడోసారి కొనసాగిస్తూ నిర్ణయం తీసుకుంది. అయితే, దీనిని సవాలు చేస్తూ కాంగ్రెస్ నేత జయా ఠాకూర్‌తోపాటు అనేకమంది సుప్రీంకోర్టులో పిటిషన్‌లు దాఖలు చేశారు. వీటిపై విచారణ జరిపిన సుప్రీంకోర్టు... సంజయ్ మిశ్రా పొడిగింపు కుదరదని స్పష్టం చేసింది. జులై 31 తర్వాత ఆయన ఆ పదవిలో ఉండరాదని తేల్చిచెప్పింది. ఆలోగా ఈడీకి కొత్త అధిపతిని నియమించుకోవాలని కేంద్రానికి సూచించింది. దీంతో కేంద్రం మరోసారి అత్యున్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించింది.

ప్రైవేట్ వర్సిటీల్లో

# కన్వీనర్ కోటాకు డిమాండ్

- ఏపీ ఈఏపీ సెట్ ద్వారా 35 శాతం సీట్ల భర్తీ
- రిజర్వేషన్లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ వర్తింపు
- చట్టంలో మార్పుచేసిన ప్రభుత్వం

**విశాలాంధ్ర బ్యూరో-అమరావతి:**
ప్రైవేట్ విశ్వవిద్యాలయాల్లో ఏర్పాటు చేసిన 35శాతం కన్వీనర్ కోటా సీట్లకు డిమాండ్ ఏర్పడింది. 2021-22 విద్యా సంవత్సరం నుంచి రాష్ట్రంలోని ప్రైవేట్ విశ్వవిద్యాలయాల్లో ఏపీ ఈఏపీసెట్ కన్వీనర్ కోటా కింద 35శాతం సీట్లను భర్తీ చేస్తున్నారు. ఈ మేరకు ఏపీ ప్రైవేట్ స్టేట్ యూనివర్సిటీస్ చట్టం-2006లో రాష్ట్ర ప్రభుత్వం మార్పులు తెచ్చింది. ఈ విధానంలో రిజర్వేషన్లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ సౌకర్యం కల్పిస్తున్నారు. ఆయా విశ్వవిద్యాలయాల్లో ప్రస్తుత కౌన్సెలింగ్‌లోనూ 35 శాతం సీట్లు కన్వీనర్ కోటా కింద భర్తీ చేయనున్నారు. ఆ విధంగా సీట్లు పొందిన విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు అర్హత ఉంటే... జగనన్న విద్యా దీవెన (జేవీడీ) ద్వారా ప్రభుత్వమే ఫీజు చెల్లిస్తుంది. జేవీడీకి అర్హత లేని విద్యార్థులంతా కన్వీనర్ కోటా కింద నిర్ణయించే ఫీజు

- మిగతా 2 లో

# ప్రతికూల రాజకీయ పరిస్థితుల్లోనూ బలంగా ముందుకు: పీసీటీఈ

మాడ్రిడ్: రాజకీయ పరిస్థితులు అనుకూలంగా లేనప్పటికీ గతంలో కంటే మెరుగైన ప్రదర్శనను కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ది వర్కర్స్ ఆఫ్ స్పెయిన్ (పీసీటీఈ) ఇచ్చింది. ఓట్లను పెంచుకుంది. 2019తో పోల్చితే ఈసారి ఎన్నికలలో 73.52శాతం ఎక్కువ ఓట్లు సాధించింది. గత మేలో జరిగిన స్థానిక ఎన్నికల్లోనూ ఈ పార్టీకి ఓట్లు పెరిగాయి. స్పెయిన్ సార్వత్రిక ఎన్నికలు ఈనెల 23న జరిగాయి. పీపుల్స్ పార్టీ (పీపీ) 136 సీట్లు గెలుచుకొని విజేతగా నిలిచింది. అయితే ఈ పార్టీకి పూర్తి మెజారిటీ రాకపోవడంతో అధికారం ఏర్పాటుపై తర్జనభర్జన కొనసాగుతోంది. 2019 డిసెంబరులో జరిగిన ఎన్నికల్లో కంటే అదనంగా 47 స్థానాలను పీపీ దక్కించుకోగలిగింది. సోషలిస్ట్ వర్కర్స్ పార్టీ (పీఎస్ఓఈ) 122 స్థానాలతో రెండోస్థానంలో నిలిచింది. వీఓఎక్స్ పార్టీ 33 స్థానాలకు పరిమితమైంది. గతసారి 52 స్థానాలలో గెలిచింది. సామాజిక ప్రజాస్వామిక కూటమి 'సుమర్' 31 స్థానాలను గెలచుకుంది. తాజా ఎన్నికల పరిణామాల నేపథ్యంలో పీసీటీసీ ఓ ప్రకటన చేసింది. గతంలో కంటే మెరుగైన ప్రదర్శన ఇవ్వడం, మరింత బలంగా ముందుకు సాగుతుండటం సంతోషంగా ఉందని తెలిపింది. స్పానిష్ కేపిటలిజం వేర్వేరు రూపాలను దీటుగా ఎదుర్కొంటున్నట్లు పేర్కొంది. గత-ప్రస్తుత ఎన్నికల క్రమంలో తమకెంత లాభం పెరిగిందని కేపటలిస్టులు లెక్కలు వేసుకుంటుంటే ఎంత ఎక్కువ జనాదరణను పొందామని కమ్యూనిస్టు పార్టీ అంచనాలు వేసినట్లు ప్రకటన పేర్కొంది. ఓవైపు పెట్టుబడిదారీ వాదం బలపడగా మరోవైపు కార్మికులు, శ్రామిక జీవితాలు, పని పరిస్థితులు క్షీణించాయని తెలిపింది. పీపుల్స్ పార్టీ విజయం సాధించినప్పటికీ పూర్తిస్థాయిలో మెజారిటీని పొందలేకపోయిందని, తమ పార్టీ గతంలో కంటే మెరుగైన పరిణామాలను సాధించిందని కమ్యూనిస్టు పార్టీ ప్రకటన వెల్లడించింది. సామాజిక సంఘాలు బలోపేతమైతే శ్రామిక పోరాటాలు అంతే బలంగా సాగగలవని పేర్కొంది. వారికి మెరుగైన జీవితం, పని పరిస్థితులకు ఆస్కారం కలుగుతుందని ఆకాంక్షించింది. శ్రామికుల తరపున పోరాటానికి కమ్యూనిస్టు పార్టీ కట్టుబడి ఉందని, కేపిటలిజం అంతానికి సంకల్పించిందని పేర్కొంది. ప్రజలు, శ్రామికుల తరపు ఉద్యమాలను మరింత ఉధృతం చేయనున్నట్లు పీసీటీపీ తెలిపింది.

విశాలాంధ్ర ప్రపంచం

# చిలీలో టీచర్ల 24గంటల సమ్మె

శాంటియాగో: విద్యా రంగంలో మెరుగుదల, మెరుగైన వేతనాలు, పింఛన్, బకాయిల చెల్లింపు తదితర డిమాండ్ల పరిష్కారం కోసం చిలీ టీచర్ల అసోసియేషన్ (సీటీఏ) అధ్వర్యంలో రాజధాని శాంటియాగోలో అధ్యాపకులు 24గంటల సమ్మె నిర్వహించారు. సమ్మెలో భాగంగా దేశవ్యాప్తంగా సమావేశాలు, ర్యాలీలను చేపట్టారు. ప్లాజా డె లా డిగ్నిడాడ్ నుంచి అవెన్యూ ఆఫ్ లా అలమేడా వరకు భారీ ప్రదర్శన జరిగింది. అగస్టో పినోచెట్ నిరుంకుశత్వం (1973-90)లో వేతనాల్లో కోతల వల్ల పింఛన్లు తగ్గిపోవడం ద్వారా చరిత్రలో ఎన్నడూ లేని విధంగా టీచర్లు నష్టపోయారని, అందుకు నష్టపరిహారం చెల్లించాలని నిరసనకారులు డిమాండ్ చేశారు. విద్యాసంస్థల్లో హింస, రిటైర్మెంట్ బోనస్‌ల చెల్లింపుల్లో జాప్యం, విద్యా రంగ ఆర్థిక నమూనాలో మార్పులు, పని ఒత్తిడి తగ్గించడం కోసం డిమాండ్ చేశారు. తమ న్యాయబద్ధ డిమాండ్ల సాధన కోసం సమ్మెను చేపట్టినట్లు టీచర్ల యూనియన్ పేర్కొంది. తమ డిమాండ్లలో చాలా వరకు ఎన్నికల ప్రచారం క్రమంలో అధ్యక్షుడు గోబ్రియల్ బోరిక్ ఇచ్చిన హామీలేనని వెల్లడించింది. ఈ మేరకు అధ్యక్షుడికి లేఖ రాసినట్లు పేర్కొంది.

## బ్రెజిల్‌లో హెల్త్ ఎమర్జెన్సీ

బ్రసిలియా: బ్రెజిల్‌లో బర్డ్‌ఫ్లూ కలకలం సృష్టించింది. వలసపక్షుల్లో హెచ్5ఎన్1 వ్యాపితో ఆ వైరస్ కట్టడికి పరాగ్వా సరిహద్దులోని పరానా రాష్ట్రంలో 180 రోజుల అత్యవసర పరిస్థితిని స్థానిక ప్రభుత్వం ప్రకటించింది. హెచ్5ఎన్1 కేసుల కట్టడికి హెల్త్ ఎమర్జెన్సీని ప్రకటించినట్లు వెల్లడించింది. ఇప్పటివరకు ఏడు కేసులు నమోదు కాగా వలసపక్షులలో వైరస్ జాడను గుర్తించినట్లు అధికారిక ప్రకటన తెలిపింది. పారిశ్రామిక వాడల్లో వైరస్ వ్యాప్తిని కట్టడి చేయడం తక్షణావశ్యమని మంత్రి నార్బెర్టో ఒర్టిగారా పేర్కొన్నారు. పరానాలో 19వేలకుపైగా పౌల్ట్రీలు ఉంటే ఇక్కడ నుంచి జరిగే మాంసం ఎగుమతి గణనీయంగా పెరిగి ఈ ఏడాదిలో ఇప్పటివరకు మిలియన్ టన్నులను దాటింది. బర్డ్‌ఫ్లూ గురించి అంతర్జాతీయ సమాజాన్ని ప్రపంచ ఆరోగ్య సంస్థ అప్రమత్తం చేసింది. గతనెలలోనే హెచ్చరికలు జారీచేస్తూ ఈ వైరస్ కట్టడికి తక్షణమే చర్యలు చేపట్టని పక్షంలో మనుషులకు వ్యాధి ముప్పు పెరగవచ్చని హెచ్చరించింది.

## మళ్లీ గెలుస్తా.. భారత్‌ను నం.3 చేస్తా

### ప్రధాని మోదీ

న్యూదిల్లీ: ముచ్చటగా మూడోసారి అధికారంలోకి వస్తానన్న దీమాను ప్రధాని మోదీ వ్యక్తంచేశారు. ఈసారి గెలిచిన తర్వాత ప్రపంచ ఆర్థిక వ్యవస్థల్లో టాప్ 3గా భారత్ ఉంటుందని, ఇది మోదీ హామీ అని చెప్పుకొచ్చారు. అభివృద్ధి నినాదంతో ప్రగతి పథంలో దేశాన్ని పరుగులు పెట్టిస్తానన్నారు. 'ఆకాశమంత ఎత్తుకు ఎదగాలి. తూర్పు నుంచి పశ్చిమం వరకు... ఉత్తరం నుంచి దక్షిణం వరకు భారత మౌలికవసతులు మారుతున్నాయి. ప్రపంచంలోనే ఎత్తైన రైల్వే వంతెన, పొడవైన సొరంగం, అతిపెద్ద స్టేడియం, ఎత్తైన విగ్రహం వంటివన్నీ భారత్‌లో ఉన్నాయి. ఆర్థికవృద్ధి కొనసాగుతోంది' అని చెప్పారు. తాను అధికారంలోకి వచ్చినప్పుడు 10వ ఆర్థిక వ్యవస్థగా ఉన్న భారత్‌ను ఐదో స్థానానికి చేర్చిన ఘనత తమకే దక్కుతుందని అన్నారు. మోదీ బుధవారం దిల్లీలోని ప్రగతి మైదాన్‌లో చేపట్టిన పనుల క్రమంలో కొత్త ప్రాంగణాన్ని ప్రారంభించారు. అంతర్జాతీయ ఎగ్జిబిషన్, కన్వెన్షన్ సెంటర్‌కు 'భారత్ మండపం'గా పేరు మార్చారు. ఇదే వేదికను రాజకీయ ప్రచారానికి వాడుకుంటున్నారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఆరు దశాబ్దాల్లో జరిగిన వృద్ధిని గత పదేళ్లలో జరిగిన వృద్ధిని ఆయన పోల్చారు. 60ఏళ్లలో 20వేల కిలోమీటర్ల రైల్వేలైన్లను విద్యుదీకరిస్తే తొమ్మిదేళ్లలో 40వేల కిమీల విద్యుదీకరణ జరిగిందని చెప్పారు. ప్రతి నెలా ఆరు కిమీల మెట్రోలైన్ పూర్తి అవుతుందని అన్నారు. విమానాశ్రయాల సంఖ్య 150కు పెరిగిందని చెప్పుకున్నారు.

## కుంభవృష్టి

(మొదటిపేజీ తరువాయి)

గోదావరికి దాదాపు 9 లక్షల క్యూసెక్కుల వరద నీరు విడుదల చేయడంతో పశ్చిమగోదావరి జిల్లాలోని లంక గ్రామాల ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. గోదావరి నీటిమట్టం 43 అడుగులు దాటడంతో అధికారులు రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. దీంతో విలీన మండలాలైన అల్లూరి సీతారామరాజు జిల్లాలోని కూనవరం, ఎటపాక, చింతూరు, వీఆర్ పురం, దేవీపట్నం మండలాల్లోని అనేక గ్రామాలు నీటమునిగాయి. చుట్టూ వరద నీరు చేరడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ముంపు గ్రామాల ప్రజలను అధికార యంత్రాంగం సురక్షిత ప్రాంతాలకు తరలించే ఏర్పాట్లు చేపడుతున్నారు. కూనవరం మండలం చుట్టూ అనేక గ్రామాలను నీరు కమ్మేసింది. నీరు గంట గంటకు పెరుగుతున్నందున అధికారులు వివిధ గ్రామాల ప్రజలను ఖాళీ చేయించారు. ఎటపాక మండలంలో అనేకచోట్ల రహదారులపై నీరు చేరడంతో రాకపోకలు పూర్తిగా స్తంభించాయి. వీఆర్ పురంలో వరద ధాటికి చింతూరు మండలానికి వెళ్లే ప్రధాన రహదారి నీట మునగటంతో రాకపోకలు నిలిచిపోయాయి. చింతూరు మండలం మీదుగా ఆంధ్ర నుంచి ఒడిశా వెళ్లే జాతీయ రహదారి నీట మునగడంతో వాహన రాకపోకలను నిలిపివేశారు. దేవీపట్నంలోని దాదాపు 44 గ్రామాలు ఇప్పటికే పూర్తిగా నీట మునిగాయి. గోదావరి నదీ తీరంలో ఉన్న మాతృశ్రీ గండిపోశమ్మ ఆలయం పూర్తిగా నీట మునిగింది. గోదావరి, శబరి నీటిమట్టాలు మరింత పెరగనున్నట్లు అధికారులు చెబుతూ ఉండడంతో విలీన మండలాల ప్రజలు క్షణక్షణం భయం భయంగా గడుపుతున్నారు. కర్నాటక రాష్ట్రం విజయనగర జిల్లాలోని హోస్పేట వద్ద ఉన్న తుంగభద్ర డ్యామ్ పైభాగంలోని శివమొగ్గ, హావేరి, మొరల్, కుక్కే సుబ్రహ్మణ్యం ఉడిపి, కుందాపుర తదితర ప్రాంతాల్లో భారీగా కురుస్తున్న వర్షానికి తుంగభద్ర నదికి భారీగా వరద ప్రవాహం వస్తోంది. సుమారు లక్షా 20 వేల క్యూసెక్కుల వరద నీరు డ్యామ్‌లో చేరుతోంది. కృష్ణా, గోదావరి పరీవాహక ప్రాంతాలన్నింటినీ అధికారులు అప్రమత్తం చేశారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు.

# సీమ ద్రోహి జగన్

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ఒకే ఒక్క జీవోతో 102 సాగునీటి ప్రాజెక్టుల పనులను రద్దు చేసి రాయలసీమకు సీఎం జగన్ తీరని ద్రోహం చేశారని టీడీపీ అధినేత చంద్రబాబు మండిపడ్డారు. పార్టీ కేంద్ర కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో చంద్రబాబు సాగునీటి ప్రాజెక్టులకు టీడీపీ ప్రభుత్వం ఎంత ఖర్చు పెట్టింది... వైసీపీ ప్రభుత్వం ఏ మేరకు ఖర్చు చేసిందో...బడ్జెట్‌లో కేటాయింపులతో సహా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. సీమ నీటికష్టాలు తీర్చడానికి ఎన్టీఆర్ తెలుగుగంగ ప్రాజెక్టు తీసుకొచ్చారని, కృష్ణా మిగులు జలాలను కరువుప్రాంతానికి అందించడం కోసం నలుగురు ముఖ్యమంత్రులను ఒప్పించారని చెప్పారు. ఆ ప్రాజెక్టు వల్ల సీమతో పాటు తమిళనాడుకు తాగునీరు అందించారన్నారు. తెలుగుగంగ తర్వాత గాలేరునగరి, హంద్రీనీవా ప్రాజెక్టులతో మొత్తం రాయలసీమను సస్యశ్యామలం చేయాలని ఎన్టీఆర్ తలచారన్నారు.

'నేను వచ్చాక పట్టిసీమ నిర్మించి...కృష్ణా జలాలను సీమకు అందించాను. దేశమంతా ఆలోచిస్తున్న నదుల అనుసంధానం ప్రాజెక్టులో ఇదొక తొలి అడుగు. నదుల అనుసంధానం చేయగలిగితే రాష్ట్రంలో ప్రతిఎకరాకు నీరు ఇవ్వవచ్చని ఆలోచించి దానికి అనుగుణంగా ఒక బ్లూ ప్రింట్ తయారుచేశాము. గోదావరి, కృష్ణా, వంశధార, నాగావళి, పెన్నా నదులతో కలిపి మొత్తం రాష్ట్రంలో చిన్నవి, పెద్దవి 69 నదులు ఉన్నాయి. గోదావరిపై నిర్మించిన పోలవరం ప్రాజెక్టు పూర్తయితే, ఆ నీటిని నేరుగా వివిధ మార్గాల్లో ఇచ్ఛాపురం వరకు అందించేలా ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టుకు ప్రణాళికలు వేశాం. మరోపక్క పోలవరం కుడికాలువ ద్వారా ప్రకాశం బ్యారేజీకి నీటిని తరలించి, శ్రీశైలంలోని కృష్ణా నీటిని రాయలసీమకు తరలించేలా ప్రణాళికలు తయారుచేశాం. ఇంకోవైపు ప్రకాశం బ్యారేజీకి వచ్చే కృష్ణానీటిని వైకుంఠపురంలో ఒక బ్యారేజీ కట్టి, అక్కడి నుంచి పల్నాడుజిల్లా నకరికల్లులోని నాగార్జునసాగర్ కుడికాలువకు కలపాలని నిర్ణయించాం. దీనికి సంబంధించిన పనులకు టెండర్లు కూడా పిలిచాం. అదేసమయంలో బొల్లాపల్లిలో రిజర్వాయర్ కట్టి, నల్లమల ఫారెస్ట్‌లో 35 కిలోమీటర్ల టన్నెల్ నిర్మిస్తే... గోదావరి నీరు నేరుగా పెన్నానదికి వెళ్తుంది. అక్కడి నుంచి నేరుగా రాయలసీమలోని అన్ని రిజర్వాయర్లకు కేంద్రబిందువైన బనకచర్ల రిజర్వాయర్‌కు నీరు చేరుతుంది. అక్కడినుంచి కండలేరు, సోమశిల వరకు నీటిని పంపవచ్చు. ఈ మొత్తం ప్రణాళికతో నదుల అనుసంధానం మొత్తం పూర్తవుతుంది. ఈ విధమైన ఆలోచన, దూరదృష్టితో రాష్ట్రాన్ని సస్యశ్యామలంచేయాలనిఆలోచించాను. సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణానికి టీడీపీ ఐదేళ్లలో రూ.68,293 కోట్లు ఖర్చుపెడితే, వైసీపీ నాలుగేళ్లలో రూ.22,165 కోట్లు మాత్రమే వెచ్చించింది. ఆ నిధులు కూడా పనులు చేయడానికి కాదు. కమీషన్లు ఇచ్చే కాంట్రాక్ట్ సంస్థలకు దోచి పెట్టారు. సాగునీటి ప్రాజెక్టుల ప్రాధాన్యత ఈ ముఖ్యమంత్రికి తెలియదు. నాటకాలు ఆడాడు. మొదటిసారి అసెంబ్లీలో మాట్లాడుతూ గోదావరి నీటిని శ్రీశైలానికి తీసుకొస్తానని ప్రగల్భాలు పలికాడు. తెలంగాణ ముఖ్యమంత్రి ఒప్పుకున్నాడని గొప్పలు చెప్పాడు. రాష్ట్రచరిత్రలో ఏ ముఖ్యమంత్రి చేయనంత ద్రోహం జగన్ రాయలసీమకు చేశాడు' అని చంద్రబాబు మండిపడ్డారు. తెలుగుదేశం ప్రభుత్వం రాగానే నదుల అనుసంధానంలో భాగంగా రాయలసీమలోని అన్నిప్రాజెక్టుల్ని పూర్తిచేసి, ప్రతి ఎకరాకు నీళ్లిస్తామన్నారు. జగన్ ప్రీక్లోజర్ చేసిన 102 ప్రాజెక్టుల్ని మరలా ఓపెన్ చేసి, అన్నీ పూర్తిచేస్తామని చంద్రబాబు స్పష్టం చేశారు. జగన్ సీమకు చేసిన అన్యాయంపై ఆధారాలతో సహా జీవోలన్నీ ప్రజలముందు పెడతానని, చేతనైతే సమాధానం చెప్పాలని సవాల్ విసిరారు. లేనిపక్షంలో ప్రజాచైతన్యంతో వైసీపీని భూ స్థాపితం చేస్తామని హెచ్చరించారు.

## మణిపూర్ ప్రజలకు అండగా ఉందాం

(మొదటిపేజీ తరువాయి)

ఉందన్నారు. అవిశ్వాస తీర్మానం వల్ల అన్ని రాజకీయ పార్టీలకు మాట్లాడే అవకాశం వస్తుందని, చివరిలో ప్రధాని మోదీ సమాధానం చెప్పాల్సి ఉంటుందన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత జాతులు, సంస్కృతులు పేరుతో సమస్యలు వచ్చాయని తెలిపారు. దక్షిణ భారతదేశం, ఈశాన్య రాష్ట్రాలు, జమ్ముకశ్మీర్ తదితర ప్రాంతాల సంస్కృతులు వేరువేరుగా ఉంటాయన్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఎంతో కష్టపడి అందరి మనోభావాలు గౌరవించబడేలా రాజ్యాంగాన్ని రూపొందించారని చెప్పారు. ఖలిస్తాన్, జమ్ముకశ్మీర్, ఈశాన్య రాష్ట్రాల సమస్యలు వచ్చినప్పుడు భారత కమ్యూనిస్టు పార్టీ రాష్ట్రాలన్నీ భారతదేశంలో అంతర్భాగమని, అందరూ కలిసి ఉండాలని స్పష్టం చేసిందని గుర్తు చేశారు. ఖలిస్తాన్ ఉద్యమం సందర్భంలో 60 మంది కమ్యూనిస్టు వీరులను పార్టీ కోల్పోయిందన్నారు. అందరూ కలిసి ఉంటేనే బలమైన భారతదేశం ఏర్పడుతుందన్నారు.

**ప్రాంతాల మధ్య ఆందోళనలు రాజకీయ ఉద్యమాలుగా మార్పు**

నేడు ప్రాంతాల మధ్య ఆందోళనలు రాజకీయ ఉద్యమాలుగా మారుతున్నాయని నారాయణ చెప్పారు. మణిపూర్‌లో మైతేయిలను గిరిజన జాబితాలో చేర్చితే అసలు గిరిజనులకు నష్టం జరుగుతుందన్నారు. భిన్న సంస్కృతులు ఉన్న భారతదేశంలో ఒకే చట్టం సాధ్యం కాదన్నారు. మణిపూర్, నాగాలాండ్ ప్రజలు ప్రత్యేక దేశం కోరుతున్నారని తెలిపారు. మణిపూర్‌లోని కుకీ తెగలకు ఆయుధాలు సరఫరా చేసి వారిని భ్రమలో పెట్టి ఓట్లు దండుకున్నారని అక్కడ పాలకపక్షాన్ని విమర్శించారు. గతంలో గుజరాత్‌లో జరిగిందే ఇప్పుడు మణిపూర్‌లో జరుగుతుందన్నారు. సైనికుడి భార్యను వివస్త్రను చేసి ఊరేగించటం అత్యంత దారుణం అన్నారు. సైనికుల ఆయుధాలు టెర్రరిస్టు గ్రూపుల వద్ద ఉన్నాయని, 250 శవాలు ఆస్పత్రిలో ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. క్రైస్తవ ఫాదర్లు పిల్లలకు చదువు చెప్పి మణిపూర్‌ను అభివృద్ధి చేస్తున్నారని తెలిపారు.

**కార్పొరేట్‌ల కోసమే అల్లర్లు**

మణిపూర్‌లో అత్యంత విలువైన ఖనిజ, అటవీ సంపదలను కార్పొరేట్‌లకు దోచిపెట్టేందుకు అక్కడ అల్లర్లు సృష్టిస్తున్నారని విమర్శించారు. 54 వేల ఎకరాల భూమిని అదానీకి మోదీ కట్టబెట్టారని తెలిపారు. మోదీ విదేశీ పర్యటనలకు వెళితే ప్రభుత్వ ఉన్నతాధికారులను కాకుండా కార్పొరేట్‌లను వెంట తీసుకెళతారని చెప్పారు. మోదీ ఆస్ట్రేలియా, శ్రీలంక, ఇజ్రాయెల్ దేశాలకు వెళ్లిన సందర్భంగా అదానీకి పెట్టుబడులు వచ్చేలా వ్యవహరిస్తున్నారని అన్నారు. ప్రధాని మోదీ మణిపూర్ రాష్ట్ర ప్రభుత్వంతో మాట్లాడి అక్కడ ప్రశాంత వాతావరణాన్ని కల్పించవచ్చని సూచించారు.

**వ్యవస్థలన్నీ భ్రష్టుపట్టిస్తున్నారు**

నరేంద్ర మోదీ అధికారం చేపట్టిన తరువాత దేశంలో రాజ్యాంగ వ్యవస్థలను భ్రష్టుపట్టిస్తున్నారని నారాయణ మండిపడ్డారు. బీజేపీ అధికారంలో లేని రాష్ట్రాల్లో గవర్నర్‌లతో పరిపాలన చేయిస్తున్నారని ఆరోపించారు. తెలంగాణ గవర్నర్ రాజకీయ వ్యాఖ్యలు చేస్తున్నారని చెప్పారు. కేంద్రం సీబీఐని పెంపుడు కుక్కలా వాడుకుంటుందని ఘాటుగా విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు అనేక మంది మంత్రులు జైలుకు వెళ్లారని, బీజేపీ అధికారంలో ఉన్నప్పుడు అవినీతి జరుగుతున్నా ఎవరూ జైలుకు వెళ్లటం లేదన్నారు. రఫేల్ విమానాల కొనుగోలు వ్యవహారంలో జరిగిన అవినీతిపై రిపోర్టు తయారు చేసినందుకు సీబీఐ డైరెక్టర్‌ను మార్చేశారని తెలిపారు. ఆర్ఎస్ఎస్, సంఘ్ పరివార్ శక్తులు చేసిన మూసలో మోదీ వ్యవహారం నడుస్తోందన్నారు. ఫాసిస్టు తత్వంతో మోదీ పాలిస్తున్నారని చెప్పారు. అమెరికా తరహా అధ్యక్ష పాలన తీసుకువచ్చేందుకు బీజేపీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు.

**చంద్రబాబు, పవన్ మాట్లాడాలి**

మణిపూర్ అంశంపై దేశవ్యాప్తంగా ఉద్యమాలు జరుగుతుంటే ఆంధ్ర ప్రదేశ్‌లో అధికార, ప్రతిపక్షాలు నోరుమెదపటం లేదని, ప్రతిపక్షంలో ఉన్న చంద్రబాబు, పవన్ కళ్యాణ్ మాట్లాడాలని నారాయణ విజ్ఞప్తి చేశారు. నిర్భయ చట్టం రావటానికి జరిగిన ఉద్యమాల స్ఫూర్తితో యావత్తు దేశం ఉద్యమించి మణిపూర్ ప్రజలకు అండగా నిలవాలన్నారు. రాష్ట్రంలో రాజకీయ పార్టీల నేతలు వ్యక్తిగత విమర్శలకు దిగటంపై మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నకు స్పందిస్తూ రాజకీయాల్లో పసలేకపోతేనే వ్యక్తిగత విమర్శలు చేస్తారని చెప్పారు. భార్యాభర్తలు కలిసి జీవించలేని పరిస్థితుల్లో విడాకులు తీసుకుని మూడు పెళ్లిళ్లు చేసుకుంటే తప్పులేదన్నారు. మూడు వివాహాల కంటే కుటుంబ సభ్యుడిని హత్య చేయటం చాలా ప్రమాదం అన్నారు. సభకు అధ్యక్షత వహించిన సీపీఐ విజయవాడ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు సభ ఉద్దేశాన్ని వివరించారు. సభ రెండు నిమిషాలు మౌనం పాటించి మణిపూర్ మృతులకు సంతాపం తెలియజేసింది. తొలుత ఆంధ్ర ప్రదేశ్ ప్రజానాట్య మండలి రాష్ట్ర అధ్యక్షులు చంద్రనాయక్, రాష్ట్ర కోశాధికారి ఆర్.పిచ్చయ్య, విజయవాడ నగర అధ్యక్షులు ఎస్.కె.నజీర్ అభ్యుదయ గీతాలు ఆలపించారు. 'నగ్నంగా నడిచింది దేహం కాదు... అది దేశం...', 'యుగాలు దాటి వచ్చిన మనిషిని మృగాలుగా మార్చింది ఎవరూ...' అంటూ మత సామరస్యాన్ని ప్రబోధించే పాటలను ఆలపించి సభికులను ఆకట్టుకున్నారు. సీపీఐ విజయవాడ నగర సహాయ కార్యదర్శి నక్కా వీరభద్రరావు స్వాగతం పలకగా, మరో సహాయ కార్యదర్శి లంక దుర్గారావు వందన సమర్పణ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణ మూర్తి, కార్యదర్శి వర్గ సభ్యులు జల్లి విల్సన్, అక్కినేని వనజ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సీహెచ్ కోటేశ్వరరావు, దోనేపూడి శంకర్, ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు రావులపల్లి రవీంద్రనాథ్ పాల్గొన్నారు.

# నేరాలు తగ్గించడమే లక్ష్యం

### 23,300 మంది మహిళలు ఇంటికి

### డీజీపీ రాజేంద్రనాథ్ వెల్లడి

### కర్నూలు, నంద్యాలలో శాంతిభద్రతల సమీక్ష

విశాలాంధ్ర - కర్నూల్ క్రైమ్: ఆంధ్రప్రదేశ్‌లో మహిళలు, బాలికల మిస్సింగ్ కేసులు 26వేలు ఉంటే 23,300 మందిని వారి ఇళ్లకు చేర్చామని ఏపీ డీజీపీ రాజేంద్రనాథ్ రెడ్డి తెలిపారు. రాష్ట్రంలో నేరాలను తగ్గించడమే లక్ష్యమని పనిచేస్తున్నామని అన్నారు. డీజీపీ బుధవారం కర్నూలు, నంద్యాల జిల్లాల్లో నేరాలపై సమీక్ష నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో శాంతిభద్రతలు అదుపులో ఉన్నాయని చెప్పారు. హత్య, వరకట్నం కోసం హత్యలు, హత్యాయత్నాలు తదితర తీవ్ర నేరాలు కర్నూలులో 27శాతం, నంద్యాలలో 25శాతం చొప్పున తగ్గినట్లు తెలిపారు. మహిళలపై నేరాలు కర్నూలులో 46 శాతం, నంద్యాలలో 65శాతం మేర తగ్గాయన్నారు. రోడ్డు ప్రమాదాలు కర్నూలులో 39 శాతం, నంద్యాలలో 36 శాతం చొప్పున తగ్గినట్లు వెల్లడించారు. ఎస్సీ-ఎస్టీ నేరాలలో 27శాతం తగ్గుదల నమోదైనట్లు చెప్పారు. దిశా యాప్‌కు ఫిర్యాదులు బాగా వస్తున్నాయని, వాటి పరిష్కారంతో మహిళలపై నేరాలు తగ్గాయని డీజీపీ తెలిపారు. కన్విక్షన్ బేస్ట్ పోలిసింగ్ సత్ఫలితాలిచ్చినట్లు వెల్లడించారు. అనేక కేసుల్లో నేరస్తులకు మరణశిక్షలతో పాటు యావజ్జీవ శిక్షలు పడినట్లు చెప్పారు. రౌడీలపై, అక్రమ మద్యం రవాణా ముఠాలపై నిఘా ఉందన్నారు. పీడీ చట్టం కింద 35 మందిని అరెస్టు చేసినట్లు తెలిపారు. ప్రతి పోలీసు అధికారికి 10 కేసుల చొప్పున కేటాయించి కేసుల సత్వర పరిష్కారానికి కసరత్తు చేస్తున్నామన్నారు. ఫాస్ట్ ట్రాక్ కోర్టుల ద్వారా 13వేల కేసులలో 1400కేసుల విచారణ పూర్తి అయిందని చెప్పారు. పోలీసుశాఖలోని ఎస్సైలకు సీఐలుగా, సూపర్ న్యూమరి డీఎస్పీలను రెగ్యూలర్ డీఎస్పీలుగా పదోన్నతులు కల్పిస్తున్నట్లు డీజీపీ తెలిపారు. కార్యక్రమంలో కర్నూలు, నంద్యాల జిల్లా ఎస్పీలు జి.కృష్ణకాంత్, కె. రఘువీర్‌రెడ్డి, డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

## 'అవిశ్వాస' అస్త్రం

(మొదటిపేజీ తరువాయి)

ప్రకటించారు. 50 మంది మద్దతు ఉంటే అవిశ్వాస తీర్మానంపై చర్చకు స్పీకర్ అంగీకరిస్తారు. కావాల్సిన మద్దతు ఉండటంతో ఓంబిర్లా అంగీకారం తెలిపారు. అయితే అఖిలపక్షంతో చర్చించాకే తేదీ, సమయాన్ని నిర్ణయిస్తానని చెప్పారు. అంతకుముందు కాంగ్రెస్ ఎంపీ మణిక్‌రామ్ ఠాకూర్ మాట్లాడుతూ 'అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టాలని ఇండియా కూటమి ఆమోదించిందని, మణిపూర్‌పై ప్రధాని నోరు విప్పేలా చేసేందుకు, ప్రభుత్వ అహాన్ని అణచివేసేందుకు చివరి అస్త్రాన్ని వాడటాన్ని కర్తవ్యంగా భావించాం' అని అన్నారు. కాగా, ప్రతిపక్షాలకు మరోమారు ప్రజలే బుద్ధి చెబుతారని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి ప్రహ్లాద్ జోషి విమర్శించారు.

**నేడే చర్చ జరగాలి: కాంగ్రెస్ డిమాండ్**

అవిశ్వాస తీర్మానాన్ని కాంగ్రెస్ ఒంటరిగా ప్రవేశపెట్టలేదని, ఇది ఇండియా కూటమి సంయుక్త నిర్ణయమని కాంగ్రెస్ ఎంపీ మనీశ్ తివారీ విలేకరుల సమావేశంలో చెప్పారు. 'అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టిన పది రోజుల్లోగా చర్చ జరగాలి. అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టడానికి అర్థం ప్రభుత్వంపై నమ్మకాన్ని సభ కోల్పోయిందని అర్థం. దీంతో అన్ని కార్యకలాపాలను నిలుపుదల చేసి దానిపై చర్చకు ప్రాధాన్యత ఇవ్వాలి. కాబట్టి గురువారమే దీనిపై చర్చను లోక్‌సభ స్పీకర్ ప్రారంభించాలి. ఇదే మా డిమాండ్' అని తివారీ నొక్కిచెప్పారు. మణిపూర్‌లో పరిస్థితి ఇంతలా ఎందుకు క్షీణించిందో మోదీ వివరించాలని, అవిశ్వాస తీర్మానంపై పూర్తిస్థాయి వివరణను ఆయన నుంచి ఆశిస్తున్నట్లు తెలిపారు. 84 రోజులుగా మణిపూర్‌లో శాంతిభద్రతలు క్షీణించాయని, సామాజిక వర్గాలు చీలిపోయాయనీ, ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోలేదని, దాంతో అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టాల్సి వచ్చిందని ఆయన వెల్లడించారు.

**ఎంపీలకు కాంగ్రెస్, బీఆర్ఎస్ విప్ జారీ**

దిల్లీ ఆర్డినెన్స్ స్థానే బిల్లుకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. దీనిని పార్లమెంటులో ప్రవేశపెట్టాలన్న యోచనలో కేంద్రం ఉంది. దీంతో కాంగ్రెస్ పార్టీ బుధవారం తమ ఎంపీలకు విప్ జారీచేసింది. గురువారం ముఖ్యమైన అంశాలు చర్చకు రానున్న క్రమంలో లోక్‌సభ, రాజ్యసభకు తప్పక హాజరు కావాలని ఎంపీలకు తేల్చిచెప్పింది. ఉదయం నుంచి చట్టసభలో ఉండాలని, పార్టీకి మద్దతివ్వాలని కోరింది. ఈ విప్‌ను ధిక్కరించవద్దని సభ్యులకు కాంగ్రెస్ సూచించింది. అటు బీఆర్ఎస్ కూడా ఇదే తరహా విప్‌ను జారీచేసింది. పార్టీ ఎంపీలంతా ఉభయ సభలకు హాజరుకావాల్సిందేనని ఆదేశించింది.

## కన్వీనర్ కోటాకు డిమాండ్

(మొదటిపేజీ తరువాయి)

మాత్రమే చెల్లించాల్సి ఉంటుంది. 2022 కౌన్సెలింగ్‌లో ఆయా విశ్వవిద్యాలయాలకు అనుగుణంగా కన్వీనర్ కోటా కింద ఫీజు దాదాపు రూ.50వేల నుంచి రూ.75వేల వరకు ప్రభుత్వం నిర్ణయించింది.

**కన్వీనర్ సీట్లపైనే ఆసక్తి**

భారీ ఫీజులు భరించలేని పేద విద్యార్థులంతా ముందస్తుగా ప్రైవేట్ విశ్వవిద్యాలయాలలోని కన్వీనర్ సీట్లనే ఎంచుకుంటున్నారు. గతేడాది ఏపీ ఈఏపీసెట్ 2022 ఇంజినీరింగ్ కౌన్సెలింగ్ ఆధారంగా అన్ని ప్రైవేట్ విశ్వవిద్యాలయాల్లో కలిపి దాదాపు 3వేలకుపైగా సీట్లు ఉన్నాయి. ఈ ఏడాది సీట్లు పెరిగే అవకాశాలున్నాయి. ఇందులో కంప్యూటర్ సైన్స్, ఇసీఈ, ఈఈఈ, సివిల్, మెకానికల్ బ్రాంచ్‌లు ఉన్నాయి. అయితే బ్రాంచ్‌లతో సంబంధం లేకుండా ప్రైవేట్ యూనివర్సిటీ సీట్లపై దృష్టి పెడుతున్నారు. గతేడాది ప్రైవేట్ విశ్వవిద్యాలయాలకే ఎక్కువ మంది విద్యార్థులు ఆప్షన్లు ఇచ్చేందుకు మొగ్గు చూపారు. ఆ తర్వాత ఆంధ్రా, జేఎన్‌టీయూ విశ్వవిద్యాలయాలు, కళాశాలలపై ఆప్షన్లు ఇవ్వడం గమనార్హం.

**యాజమాన్య కోటా సీట్లు అందని ద్రాక్షేనా?**

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన అనంతరం చెన్నై, ఒడిశా, కర్నాటకలో పేరొందిన ప్రైవేట్ విశ్వవిద్యాలయాలు తమ కార్యకలాపాల్ని రాష్ట్రంలోనూ ప్రారంభించాయి. భారతీయ ఇంజినీరింగ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఇన్నోవేషన్(అనంతపురం), సెంచూరియన్ (విశాఖపట్నం), అమరావతిలోని ఎస్ఆర్ఎం, వీఐటీ ఏపీ, మోహన్‌బాబు (తిరుపతి) తదితర విశ్వవిద్యాలయాలున్నాయి. ప్రైవేట్ విశ్వవిద్యాలయాలు ప్రత్యేక పరీక్షలు నిర్వహించి విద్యార్థులకు ప్రవేశాలు కల్పిస్తాయి. అందులో ఎలాంటి రిజర్వేషన్లు, ఫీజు రాయితీలు ఉండవు. పేరుకే ప్రవేశ పరీక్షలు అయినప్పటికీ, ఫీజులన్నీ దాదాపు అందరికీ సమానంగానే ఉంటాయి. ప్రవేశ పరీక్షలో అత్యధికంగా మార్కులు సాధించిన వారికి రూ.10వేల నుంచి 25వేల వరకు రాయితీ కల్పిస్తారు.

ఈ విశ్వవిద్యాలయాల్లో క్యాంపస్ రిక్రూట్‌మెంట్‌లు అధికంగా ఉంటాయనే ప్రచారాన్ని తీసుకొచ్చి, విద్యార్థులు, తల్లిదండ్రులకు ఎరవేస్తున్నారు. దీంతో ఐఐటీ, ఎన్ఐటీలో సీట్లు సాధించలేని విద్యార్థులంతా ఏపీతోపాటు ఇతర రాష్ట్రాల్లోని ప్రైవేట్, డీమ్డ్ విశ్వవిద్యాలయాల్లో యాజమాన్య కోటా కింద బీటెక్ కోర్సులు చదివేందుకు ఎగబడుతున్నారు. వాటిల్లో చదవాలంటే ఏడాదికి రూ.3లక్షలకుపైగా కేవలం ఫీజుకే అవుతుంది. దూర ప్రాంతాల విద్యార్థులు హాస్టల్‌లో ఉంటే అదనంగా మరో రూ.లక్షా 50వేలు అవుతుంది. ఇతరత్రా ఖర్చులు కలుపుకుని మొత్తంగా ఏటా రూ.5లక్షల వరకు ఖర్చు అవుతుంది. అలాంటి ప్రైవేట్ విశ్వవిద్యాలయాల్లో కన్వీనర్ కోటా కింద సీట్లను వైసీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసింది.

**ఇంజినీరింగ్ ధ్రువీకరణ పత్రాల నమోదు ప్రారంభం**

ఆంధ్రప్రదేశ్ ఇంజినీరింగ్ అగ్రికల్చర్ ఫార్మసీ (ఏపీ ఈఏపీసెట్) 2023 ప్రవేశాల వెబ్ కౌన్సెలింగ్‌లో భాగంగా ఇంజినీరింగ్ విభాగం అభ్యర్థులకు ఈనెల 25 నుంచి ధ్రువీకరణ పత్రాల నమోదు ప్రక్రియ ప్రారంభమైంది. ఆగస్టు 4 వరకు అభ్యర్థులు వెబ్‌సైట్‌లోకి వెళ్లి స్వయంగా తమ అసలు ధ్రువీకరణ పత్రాలను స్కాన్ చేసి పొందు పరచాలి. అలాంటి సమయంలో ఏమైనా సాంకేతిక సమస్యలు తలెత్తితే, సమీప సహాయ కేంద్రానికి వెళ్లి సరిచూసుకోవాలి. ఈనెల 24వ తేదీ నుంచి ఆగస్టు 3 వరకు ఈ కౌన్సెలింగ్ ప్రక్రియ కొనసాగనుంది. అభ్యర్థులు ఫీజు చెల్లించి తమ వివరాలను నమోదు చేసుకోవాలి.ఆగస్టు 3వ తేదీ నుంచి 8వరకు వెబ్ ఆప్షన్ల ప్రక్రియ కొనసాగుతుంది. ఆ తర్వాత 12న సీట్లను ఖరారు చేస్తారు. ఆయా అభ్యర్థులు తమ వివరాలతో సీట్లు పొందిన కళాశాలలకు 13, 14 తేదీల్లో వెళ్లి అందజేయాలి. ఆగస్టు 16వ తేదీ నుంచి ఇంజినీరింగ్ తరగతులు ప్రారంభమవుతాయి.

# పంట రుణ బకాయిలు రద్దు చేయాలి

- రైతు ఉపశమన చట్టం ఆమోదింపజేయాలి
- 30న రాష్ట్ర సదస్సు విజయవంతం చేయండి
- రైతు సంఘాల సమావేశంలో వడ్డేశోభనాద్రీశ్వరరావు

**విశాలాంధ్ర బ్యూరో-అమరావతి :** రైతుల పంట రుణ బకాయిలను దేశవ్యాప్తంగా ఒకేసారి రద్దు చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలని, రైతు రుణ ఉపశమన చట్టాన్ని పార్లమెంటులో ఆమోదింప జేయాలని, రైతులను, కౌలు రైతులను ఆత్మహత్యల నుంచి రక్షించాలని ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘాల సమన్వయ సమితి రాష్ట్ర కన్వీనర్, మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వర రావు డిమాండ్ చేశారు. కార్మికుల హక్కులకు నష్టం కలిగించే నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేసి కార్మికుల హక్కులను పునరుద్ధరించాలని కోరారు. విజయవాడ బాలోత్సవ్ భవన్‌లో బుధవారం వడ్డే శోభనాద్రీశ్వరరావు అధ్యక్షతన రైతు సంఘాల సమావేశం జరిగింది. వివిధ తీర్మానాలను సమావేశం ఆమోదించింది. మహిళా రెజ్లర్లను లైంగికంగా వేధించిన ఎంపీ బ్రిజ్‌భూషణ్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని, మణిపూర్‌లో మహిళలపై కొనసాగుతున్న దాడులను అరికట్టాలని, దీనికి నైతిక బాధ్యత వహిస్తూ మణిపూర్, రాష్ట్ర, కేంద్ర బీజేపీ ప్రభుత్వాలు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈనెల 30న విజయవాడ పీబీ సిద్ధార్థ కళాశాల ఆడిటోరియంలో రాష్ట్ర సదస్సు జరుగు తుందన్నారు. దీనికి ఆల్ ఇండియా కిసాన్ సభ జాతీయ ప్రధాన కార్యదర్శి అతుల్ కుమార్ అంజన్, ఉపాధ్యక్షులు హసన్ మొల్లా, కార్యదర్శి ఎస్.రాజా రామ్ సింగ్, కేకేయూ జాతీయ కార్యదర్శి రామీంద్ర సింగ్ పాటియాల, ఏఐకేఎంఎస్ జాతీయ అధ్యక్షులు సత్యవాన్, కాంగ్రెస్ కిసాన్ సెల్ జాతీయ అధ్యక్షుడు సుఖపాల్ సింగ్ ఖ్యెరా, ఎన్‌ఏపీఎం జాతీయ నాయకురాలు మేధాపాట్కర్, జాతీయ వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి బి.వెంకట్, అఖిల భారత అగ్రగామి కిసాన్ సభ జాతీయ కార్యదర్శి పీవీ సుందరామరాజు, అఖిల భారత రైతు కూలీ సంఘం ప్రధాన కార్యదర్శి అశోక్ ఘూయాల్, ఏఐకేవీఎస్ జాతీయ నాయకులు ఆర్.చంద్రశేఖర్ తదితరులు పాల్గొంటారని ఆయన తెలిపారు. ఈ సదస్సును జయప్రదం చేయాలని సమావేశం తీర్మానిం చిందన్నారు. రాష్ట్ర సదస్సును విజయవంతం చేయడానికి సన్నాహాలు చురుకుగా సాగుతున్నాయని, అన్ని జిల్లాల్లోనూ రైతు సంఘాలు మరింత కృషి చేయాలని సమావేశం విజ్ఞప్తి చేసిందన్నారు. ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘం ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాలు, వరదలు, తుపానుల వల్ల నష్టపోయిన రైతాంగాన్ని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని, మరల రైతులు విత్తు నాటుకోవడానికి అవసరమైన ఇన్‌పుట్స్‌ను వెంటనే అందించాలని, రైతుల పాలిట ఉరితాడు కాగల విద్యుత్ బిల్లును పార్లమెంటులో ఉపసంహరించుకోవాలని, వ్యవ సాయ మోటార్లకు ప్రీపెయిడ్ స్మార్ట్ ఎలక్ట్రిసిటీ మీటర్లు బిగించరాదని డిమాండ్ చేశారు. రైతు సంఘం సీనియర్ నాయకులు వై.కేశవరావు మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల పునరావాసానికి అయ్యే ఖర్చును రాష్ట్ర ప్రభుత్వమే భరించాలనడం తగదని, ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం వెంటనే అవసరమైన నిధులను మంజూరు చేసి ఆదివాసీ, దళితులు మున్నగు బాధిత ప్రజల పునరావాసానికి పనులు పూర్తి చేయాలన్నారు. ఆంధ్ర ప్రదేశ్ కౌలు రైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య మాట్లాడుతూ కౌలు రైతులకు భూ యజమాని ప్రమేయం లేకుండానే కౌలు గుర్తింపు కార్డులు జారీ చేయాలని, తద్వారా రైతు భరోసా, స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం పంట రుణాలు అందజేయాలని కోరారు. ఢిల్లీ రైతు ఉద్యమంలో అశువులు బాసిన 750 మంది రైతు కుటుంబాలకు, లఖింపురి ఖేరి ఘటనల్లో ప్రాణాలు కోల్పోయిన ఐదు కుటుంబాల వారికి ఆర్థిక సహాయం అందించడంతో పాటు కేంద్ర మంత్రి అజయ్ మిశ్రాను బర్తరఫ్ చేయాలని కోరారు. ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య మాట్లాడుతూ పంటలన్నిటికీ సమగ్ర పంటల ఉత్పత్తి వ్యయానికి సీ2ం 50 శాతం కలిపి చట్టబద్ధ కనీస మద్దతు ధరలను నిర్ణయిం చాలన్నారు. జాగృతి రైతు సంఘం రాష్ట్ర నాయకులు మాట్లాడుతూ అటవీ చట్టంను విస్మరిస్తూ ఆదివాసీల హక్కులకు భంగం కలిగించరాదని కోరారు. ఈ సమావేశంలో రైతు సంఘం నాయకులు కె.కోటయ్య, కోగంటి ప్రసాద్, కొలనుకొండ శివాజీ పాల్గొన్నారు.

## రైతుల్ని ఆదుకోవాలి

### ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం

**విశాలాంధ్ర బ్యూరో- అమరావతి:** గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాల వల్ల కృష్ణా, గోదావరి డెల్టాల పరిధిలో వరిపంట దెబ్బతిని రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారని, తక్షణమే వారిని ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్, కౌలు రైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి. జమలయ్య బుధవారం ఒక ప్రకటనలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ఏలూరు, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, కాకినాడ, కోనసీమ తదితర జిల్లాల్లో వేసిన వరి నారుమళ్లు, నాట్లు దెబ్బతిన్నాయన్నారు. అధిక వర్షాల వల్ల పంట పొలాల్లో నీరు చేరడంతో నారు కుళ్లిపోతోందన్నారు. ఆయా జిల్లాల్లో సుమారు 20శాతంపైగా ఇప్పటికే నాట్లు వేశారని, పెంచిన వరినారు సైతం ఈ అధిక వర్షాలతో దెబ్బతినడంతో రైతాంగం తిరిగి నారుపోసుకోవాల్సిన దుస్థితి ఏర్పడు తుందని తెలిపారు. రైతులు పంట భూముల్లో ఉన్న నీటిని బయటకు పంపాలన్నా కష్టంగా ఉందని, మురుగు నీటి డ్రెయిన్లలో గుర్రపుడెక్క పేరుకుపోయి నీరు బయటకు పోయే మార్గంలేక రైతాంగం ఆందోళన చెందుతున్నారన్నారు. డ్రెయిన్లలోని పూడిక, గుర్రపుడెక్కలను తొలగించ డంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహించినందువల్ల ఈ పరిస్థితి ఏర్పడిందన్నారు. అల్పపీడన ప్రభావంతో ఇంకా భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ ప్రకటించడంతో రైతాంగం మరింత ఆందోళనకు లోనవుతున్నారన్నారు. ఈ దశలో తిరిగి పంట వేసుకునేందుకు విత్తనాలు ఉచితంగా సరఫరా చేయాలని రైతు సంఘం నేతలు డిమాండు చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా రహదారులు గోతులమయంగా మారినందున ప్రజలు నానా అవస్థలు పడుతున్నారని, తక్షణం రాష్ట్ర ప్రభుత్వం రహదారులకు మర్మమతులు చేపట్టాలని వారు కోరారు.

## సీపీఐలో చేరికలు

**విశాలాంధ్ర-ఉండి:** దేశం కోసం, ప్రజలు కోసం ప్రాణత్యాగాలు చేసిన చరిత్ర భారత కమ్యూనిస్టు పార్టీదని కోనాల భీమారావు అన్నారు. గురువారం ఉండి మండలం పాందువ్వ గ్రామంలో అనేకమంది సీపీఐ సభ్యత్వం తీసుకున్నారు. కొత్తగా పార్టీలో చేరిన వారిని సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు పార్టీ కండువా కప్పి సీపీఐ లోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన బద్దా రమేశ్ ఇంటివద్ద పార్టీ పతాకాన్ని ఆవిష్కరించిన అనంతరం భీమారావు మాట్లాడుతూ... దేశ స్వాంతంత్ర్యోద్యమ పోరాటాంలో ఎంతోమంది కమ్యూనిస్టులు వీరోచితంగా పోరాడి ప్రాణలర్పించారన్నారు. స్వాతంత్ర్యానంతరం దేశంలో పేదరికం, సామాజిక అసమానతలు, దోపిడీ లేని వ్యవస్థ కోసం అందరికీ కూడు, గూడు, గుడ్డ లాంటి కనీసావసరాలు నెరవేర్చాలని కోరుతూ పెద్ద ఎత్తున సీపీఐ ఉద్యమించిందన్నారు. కమ్యూనిస్టు పార్టీ పోరాటఫలితంగానే భుసంస్కరణల చట్టం అమలులోకి వచ్చిందన్నారు. ఈచట్టం ద్వారా సీపీఐ నిర్వహించిన అనేక భూపోరాటాలు ఫలితంగా లక్షలాది ఎకరాల భూమి పేదలకు పంపిణీ జరిగిందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రైతాంగం, ప్రజలెదుర్కొంటున్న సమస్యల పరిష్కార సాధన దిశగా ఉద్యమించి సీపీఐ బలోపేతానికి కృషి చేయాలని భీమారావు కోరారు. పాందువ్వ గ్రామానికి చెందిన బద్దా రామకృష్ణ, బద్దా ఝాన్సీ, బద్దా రాంబాబు, బద్దా రమేష్, బద్దా శ్యామల, కటిక రాముడు, ఇ.భాగ్యవతి, పుచ్చకాయల శాంతరత్నం,పుచ్చకాయల నానీ సీపీఐ సభ్యత్వం తీసుకున్నారు. వీరికి భీమారావుతో పాటు సీపీఐ ఉండి మండల కార్యదర్శి కలిశెట్టి వెంకట్రావు, జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం.సీతారాం ప్రసాద్, జిల్లా సమితి సభ్యులు గంజి రాజు, సనపల శ్రీనివాస్, కోన గొల్లయ్య, తమ్మరాని శ్రీనివాస్ సీపీఐ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

## నేటినుంచి గిరిజన సమాఖ్య రాష్ట్ర మహాసభలు

### జయప్రదానికి ఈశ్వరయ్య పిలుపు

**విశాలాంధ్ర-గాలివీడు/రాయచోటిటౌన్:** గిరిజన హక్కుల పోరాటాల్లో భాగంగా ఈనెల 27-30 తేదీల్లో ఆంధ్రప్రదేశ్, అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటిలో జరిగే గిరిజన సమాఖ్య రాష్ట్ర మూడో మహాసభలను జయప్రదం చేయాలని సీపీఐ ఏపీ కార్యదర్శివర్గ సభ్యులు గుజ్జల ఈశ్వరయ్య పిలుపునిచ్చారు. గాలివీడు మండలంలో పర్యటించిన ఆయన కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ దేశంలో గిరిజన, దళిత, బహుజన మైనార్టీ వర్గాలపై దాడులు పెరిగాయని, శ్రామిక వర్గాలను కాపాడుకోవడానికి ప్రశ్నించే గొంతుకలుగా తయారు కావాలని సూచించారు. మహాసభలకు 26 జిల్లాల నుంచి ప్రతినిధులు హాజరవుతారని చెప్పారు. దింసా నృత్యం, తప్పెట గుళ్లు, కొమ్ము నృత్యం, గుసాడి, కోలాటం, డప్పు కళాకారుల ప్రదర్శనలు, రాయలసీమ గిరిజన మహిళల నృత్య ప్రదర్శన ఆకటుకోనున్నట్లు తెలిపారు. ముఖ్య అతిథులుగా సీపీఐ ఆంధ్రప్రదేశ్ సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి, అరుణోదయం విప్లవ గాయని విమలక్క హాజరవుతారని చెప్పారు. 26 జిల్లాల్లోని సుగాలి, లంబాడీ, బంజారా, చెంచు, యానాది, బుగత, కొండ రెడ్డి, వాల్మీకి, ఏరుకుల, నక్కల, దులియా, పైకో, పొతియా వర్గీయులు తరలిరావాలని కోరారు. దళిత, బహుజన, మైనార్టీ వారూ పాల్గొని మహాసభలను జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి పి.మహేశ్, నియోజకవర్గ కార్యదర్శి సిద్దిగాళ్ల శ్రీనువాసులు, మండల సహాయ కార్యదర్శి కృష్ణమూర్తి పాల్గొన్నారు.

**రాష్ట్రాన్ని రక్షించుకోవడం పార్టీల బాధ్యత**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని రక్షించుకోవలసిన బాధ్యత అన్ని రాజకీయ పార్టీలపై ఉందని ఈశ్వరయ్య అన్నారు. కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజలకు అవగాహన కల్పించే ఉద్దేశంతో సీపీఐ ఆగస్టు 16 నుంచి సెప్టెంబరు 6వ తేదీ వరకు 22 రోజులు బస్సు యాత్రను తలపెట్టిందని, దీనిని విజయవంతం చేద్దామని పిలుపునిచ్చారు. 'రాష్ట్రాన్ని రక్షించండి-దేశాన్ని కాపాడండి' అనే నినాదంతో ముందుకెళదామన్నారు. సీపీఐ బస్సు యాత్రలో పార్టీ శ్రేణులు, ప్రజలు పాల్గొనాలని కోరారు. కేంద్రం అప్పు ఇవ్వకపోతే ఉద్యోగులకు ఒక్క నెల జీతభత్యాలు ఇచ్చే పరిస్థితి రాష్ట్ర ప్రభుత్వానికి లేదని విమర్శించారు. విద్యుత్ చార్జీలు, ఖాళీ స్థలాల పన్ను, చెత్త పన్ను, నీటి పన్ను, విద్యుత్ మీటర్లతో పాటు పెరిగిన నిత్యవసరాల ధరలతో ప్రజలపై భరించలేని భారం పడుతోందన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి శూన్యమని, కడప ఉక్కు పరిశ్రమ కోసం ముగ్గురు ముఖ్యమంత్రులు నాలుగుసార్లు శంకుస్థాపన చేయడం సిగ్గుచేటని విమర్శించారు. పోలవరం ప్రాజెక్టు, రాష్ట్ర హక్కుల కోసం డిమాండ్ చేసే పరిస్థితి జగన్‌కు లేదని, ఆయనకు కేసుల భయమని ఈశ్వరయ్య ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పి.కోటేశ్వరరావు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించకుంటే

## సీఎం కార్యాలయాన్ని ముట్టడిస్తాం

**విశాలాంధ్ర బ్యూరో-అనంతపురం :** రాష్ట్రంలో విద్యారంగ సమస్యలపై సీఎం జగన్ ప్రత్యేక దృష్టి సారించి వాటిని పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టాలని, లేని పక్షంలో లక్షల మంది విద్యార్థులతో కలసి తాడేపల్లిలోని ముఖ్యమంత్రి క్యాంప్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వి.జాన్సన్ బాబు హెచ్చరించారు. ఈ మేరకు బుధవారం జిల్లా కేంద్రంలోని కామ్రేడ్ నీలం రాజశేఖర రెడ్డి భవన్‌లో సీపీఐ విద్యార్థి విభాగం ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి చిరంజీవితో కలసి విలేకర్ల సమావేశం నిర్వహించారు. కేజీ నుంచి పీజీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా మంగళవారం జరిగిన విద్యాసంస్థల బంద్ విజయవంతం కావడంపై నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జాన్సన్ బాబు మాట్లాడుతూ ఏళ్ల తరబడి విద్యారంగ సమస్యలు పట్టించుకోకుండా జగన్ ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని మండిపడ్డారు. ముందుగా విద్యా సంస్థల బంద్‌కు సహకరించిన విద్యార్థులు వారి తల్లిదండ్రులు, విద్యాసంస్థల యాజమాన్యాలు, ఇతరత్రా మేధావులకు ధన్యవాదాలు తెలిపారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కళ్లు తెరిచి రాష్ట్రంలో విద్యారంగ సమస్యలు పరిష్కరించే దిశగా యోచించాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల్లో మౌలిక వసతులు కల్పించాలని, పెరిగిన నిత్యావసర సరుకుల ధరల కనుగుణంగా మెస్ చార్జీలు పెంచాలని, కాస్మోటిక్ చార్జీలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. హాస్టళ్లలో ఖాళీగా ఉన్న వార్డెన్, కుక్, అటెండర్, వాచ్‌మెన్, కామాటి, ట్యూటర్ పోస్టులను తక్షణమే భర్తీ చేయాలన్నారు. సంక్షేమ హాస్టళ్లు అద్దె భవనాల్లో కాకుండా సొంత భవనాలు నిర్మించాలన్నారు. విద్యార్థులు తాగడానికి రక్షిత మంచినీటి కోసం మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయాలని అన్నారు. కేజీబీవీ, గురుకుల పాఠశాలల్లో ఖాళీగా ఉన్న టీచర్ పోస్టులు భర్తీ చేసి, అదనపు తరగతి గదులు ఏర్పాటు చేయాలన్నారు. మహిళల రక్షణను దృష్టిలో ఉంచుకుని వారి వసతి గృహాలకు ప్రహరీ గోడలు నిర్మించాలన్నారు. పేద, బడుగు బలహీనవర్గాల విద్యార్థుల కోసం ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో మౌలిక వసతులు కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు. తక్షణమే ప్రభుత్వ విద్యా సంస్థల్లో విద్యార్థులు కూర్చోవడానికి బెంచీలు, తాగడానికి నీటి సదుపాయం, మరుగు దొడ్లు ఏర్పాటు చేయాలని అన్నారు. ఖాళీగా ఉన్న లెక్చరర్ పోస్టులతో సహా ల్యాబ్‌కు కావలసిన పరికరాలు ఏర్పాటు చేయాలని, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని పునః ప్రారంభించి, తక్షణమే పాఠ్య పుస్తకాలు ఇవ్వాలన్నారు. విశ్వవిద్యాలయాల అభివృద్ధికి నిధులు విడుదల చేసి ఖాళీగా ఉన్న ప్రొఫెసర్, టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులు తక్షణమే భర్తీ చేయాలని, డిగ్రీ కోర్సును పాత పద్ధతిలో కొనసాగించాలని, ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థల్లో ఫీజు నియంత్రణ హక్కు చట్టం తీసుకు రావాలని డిమాండ్ చేశారు. జీవో నంబరు 72ను రద్దు చేయాలని, నగర పరిధిలోని సెంట్రల్ యూనివర్సిటీకి నిధులు కేటాయించే విధంగా కేంద్రంపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తీసుకొని రావాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా సంక్షేమ హాస్టళ్ల అధికారులందరూ వారానికి ఒకసారి ఆయా హాస్టళ్లలో నిద్రపోయేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఏఐఎస్ఎఫ్ నగర కార్యదర్శి ఉమా మహేష్, నాయకులు జగదీష్, ప్రకాష్, మహేష్,రాజు, భగవాన్ తదితరులు పాల్గొన్నారు.

## సైన్స్ అండ్ టెక్నాలజీ మ్యూజియం ప్రాజెక్టుకు ఆమోదం

**విశాలాంధ్ర-గుంటూరు :** రాష్ట్రంలో అధునాతన సైన్స్ అండ్ టెక్నాలజీ మ్యూజియం ప్రాజెక్టుకు భారత ప్రభుత్వ సాంస్కృతిక మంత్రిత్వ శాఖ నుంచి ఆమోదం లభించిందని సైన్స్ సిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (ఎస్‌సీఏపీ) సీఈఓ డాక్టర్ కె.జయరామిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మ్యూజియం గ్రాంట్ స్కీమ్ కింద సైన్స్ సిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (ఎస్‌సీఏపీ)కు అధునాతన సైన్స్ అండ్ టెక్నాలజీ మ్యూజియం స్థాపించడానికి ప్రాజెక్టును మంజూరు చేసిందన్నారు. ఈ ప్రాజెక్టు ప్రతిపాదించిన మొత్తం బడ్జెట్ రూ.4.69 కోట్లలో రూ.3,75,20,000లు ఎస్‌సీఏపీకి గ్రాంట్-ఇన్-ఎయిడ్ ద్వారా మంజూరైందని, మిగిలిన బడ్జెట్ రాష్ట్ర ప్రభుత్వం ద్వారా మంజూరు అయినట్లు తెలిపారు. ఈ ప్రాజెక్టును విశాఖపట్నంలోని కైలాసగిరిలో అమలు చేయనున్నట్లు వెల్లడించారు. ఈ అడ్వాన్స్‌డ్ సైన్స్ అండ్ టెక్నాలజీ మ్యూజియంలో 3డీ ఆర్ట్ గ్యాలరీ, ఆగ్మెంటెడ్ రియాలిటీ(ఏఆర్), సిలికా విగ్రహాలను ఏర్పాటు చేసి సంస్కృతిని, సైన్స్, సాంకేతికతను ఏకీకృతం చేయడానికి వీలు కల్పిస్తుందన్నారు. ఈ ప్రదర్శనలలో శాస్త్రీయ థీమ్‌లు, విద్యా విషయాలను సమగ్రపరచడం లక్ష్యంగా పెట్టుకున్నామని, తద్వారా విద్యార్థులు, సందర్శకులు సులభంగా, ఇంటరాక్టివ్‌గా నేర్చుకోవడానికి వీలు కలుగుతుందని చెప్పారు. ఇది దృశ్య, ప్రయోగాత్మక అభ్యాసం ద్వారా శాస్త్రీయ భావనలపై లోతైన అవగాహనను పెంపొందిస్తుందన్నారు. సైన్స్ అండ్ టెక్నాలజీలో సరికొత్త ఆవిష్కరణలను ప్రదర్శించడానికి వేదికగా కూడా పని చేస్తుందని తెలిపారు.

## ఎమ్మెల్యే పర్వతకు నిరసన సెగ

**విశాలాంధ్ర-అన్నవరం:** కాకినాడ జిల్లా ప్రత్తిపాడు, ఏలేశ్వరం మండలం జడ్డింగ్ అన్నవరంలో ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్‌ను నిరసన సెగ తాకింది. జగనన్న సురక్ష, గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యేపై ప్రజలు మండి పడ్డారు. నాలుగేళ్లైనా తమ గ్రామానికి సరైన రోడ్డు, డ్రైనేజీ లేకపోవడాన్ని ప్రశ్నించారు. ఎమ్మెల్యే కారును అడ్డగించారు. ఓ యువకుడు వాహనాన్ని కదలనివ్వకుండా అడ్డంగా పడుకోగా, గ్రామస్తులు మోటార్‌సైకిళ్లు అడ్డుపెట్టారు. ఓ దశలో ఎమ్మెల్యే వాగ్వాదానికి దిగారు. చేసేదేమీ లేక ఎమ్మెల్యే అక్కడ నుంచి వేరే వాహనంలో వెళ్లిపోయారు.

## కడప ఉక్కుపై కేంద్ర ప్రకటన అహంకారపూరితం

**నిరుద్యోగుల ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టిన వైసీపీ ఎంపీలు**

**ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివారెడ్డి**

**విశాలాంధ్ర బ్యూరో-అమరావతి :** కడప జిల్లాలో ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటుకు ఆర్థికంగా, సాంకేతికంగా సాధ్యం కాదని కేంద్ర ఉక్కు శాఖ సహాయ మంత్రి నిత్యానంద రాయ్ లోక్‌సభలో ప్రకటించడం కేంద్ర ప్రభుత్వ అహంకారానికి పరాకాష్టని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.శివారెడ్డి తీవ్రంగా విమర్శించారు. కరవు, వలసలు, ఆత్మహత్యలకు నిలయంగా మారిన కడప జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్ష మందికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలన్న లక్ష్యంతో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి బ్రాహ్మణి స్టీల్ ప్లాంట్‌కు శంకుస్థాపన చేసి గనులు, నీళ్లు, భూములు కేటాయించారని గుర్తు చేశారు. బ్రాహ్మణి యాజమాన్యం పరిశ్రమ ఏర్పాటు చేయకుండా కేటాయించిన గనులను కొల్లగొట్టి, నిబంధనలను అతిక్రమించి అడ్డగోలుగా దొరికిపోవడంతో పరిశ్రమ నిర్మాణం ఆగిపోయిందన్నారు. ప్రభుత్వ రంగంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు కోసం జిల్లావ్యాప్తంగా పార్టీలకతీతంగా ప్రజలు, ప్రజా సంఘాలు పెద్ద ఎత్తున సాగించిన పోరాటాలతో నాటి యూపీఏ ప్రభుత్వం కడప ఉక్కు పరిశ్రమను రాష్ట్ర విభజన చట్టంలో చేర్చిందన్నారు. అయితే అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం విభజన హామీలకు తిలోదకాలు ఇచ్చిందని ధ్వజమెత్తారు. ఎన్నికల ముందు వైఎస్ జగన్ రాష్ట్రంలో ఎక్కువ ఎంపీ స్థానాలు తనకు ఇస్తే కేంద్ర ప్రభుత్వం మెడలు వంచి కడప ఉక్కు పరిశ్రమ, రాష్ట్రానికి ప్రత్యేక హోదా, జాతీయ హోదా కలిగిన పోలవరానికి నిధులు, వెనకబడిన రాయలసీమ జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీ, రైల్వే జోన్, దుగ్గిరాజపట్నం, రెవెన్యూ లోటు భర్తీకి, విద్యా వైద్య రంగాల అభివృద్ధికి అవసరమైన నిధుల సాధన కోసం శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని హామీ ఇచ్చారన్నారు. అధికారంలోకి వచ్చి నాలుగేళ్లు దాటినప్పటికీ సీఎం జగన్ విభజన హామీలపై ఏ రోజూ మాట్లాడలేదంటూ విమర్శించారు. సీఎం సొంత జిల్లా ఉమ్మడి కడపకు రెండు పార్లమెంటు, 10 అసెంబ్లీ స్థానాలను కట్టబెట్టినప్పటికీ ఆ జిల్లా ప్రజల ఆకాంక్ష ఉక్కు పరిశ్రమ స్థాపనకు కేంద్రంపై ఒత్తిడి చేసిన దాఖలాలు లేవన్నారు. రాష్ట్ర ప్రజల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసిన కేంద్ర ప్రభుత్వంపై వైసీపీ తాడోపేడో తేల్చుకోవాలని, లేకుంటే లోక్‌సభ ప్యానల్ స్పీకర్‌గా ఉన్న పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, కడప ఎంపీ అవినాశ్ రెడ్డి రాజీనామా చేసేంతవరకు పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని ప్రకటించారు. వ్యక్తిగత ప్రయోజనాలు, స్వార్థ రాజకీయాల కోసం రాష్ట్ర ప్రజల ప్రయోజనాలను కేంద్రానికి తాకట్టు పెట్టిన సీఎం జగన్ రాష్ట్రంలో ఓట్లు అడిగే నైతిక హక్కు కోల్పోయారన్నారు. కేంద్రం కడప ఉక్కు ఫ్యాక్టరీ నిర్మాణం చేపట్టేంతవరకు దశల వారీ ఉద్యమాలకు సన్నద్ధవుతామని శివారెడ్డి తెలిపారు.

## రైళ్లలో జర్నలిస్టుల రాయితీని పునరుద్ధరించాలి

**విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్:** జర్నలిస్టులకు రైలు చార్జీల్లో కల్పిస్తున్న రాయితీని పునరుద్ధరించాలని గుంటూరు ఎంపీ గల్లా జయదేవ్ బుధవారం లోకసభలో ప్రధాని నరేంద్ర మోదీకివిజ్ఞప్తి చేశారు. లోక్‌సభలో రూల్ 377 కింద ఈ విషయాన్ని జయదేవ్ ప్రస్తావిం చారు. ప్రజలకు సమాచారం అందించడంలో జర్నలి స్టులు కీలక పాత్ర పోషిస్తుంటారని, వృత్తిరీత్యా విస్తృతంగా ప్రయాణాలు చేస్తుంటారని వెల్లడించారు. అయితే జర్నలిస్టులకు ఇస్తున్న రాయితీని కోవిడ్-19 వ్యాపించిన సమయంలో రద్దుచేశారని, ఇప్పటివరకు దానిని పునరుద్ధరించలేదని ఆయన పేర్కొన్నారు. జర్నలిస్టులకు రాయితీలు లేకపోవడం వల్ల వారిపై అదనపు భారం పడుతోందన్నారు. గుర్తింపు పొందిన ప్రెస్ కరస్పాండెంట్లకు కోవిడ్ ముందు కాలంలో ఉన్న తరహాలో రాయితీలు, ఇతర సౌకర్యాలను పునరుద్ధరించాలని రైల్వే మంత్రి అశ్వని వైష్ణవ్, ప్రధాని మోదీకి జయదేవ్ విజ్ఞప్తి చేశారు.

## సీమ ప్రాజెక్టుల్ని అడ్డుకుంది చంద్రబాబే

### ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి

**విశాలాంధ్రబ్యూరో-హైదరాబాద్/అమరావతి:** రాయలసీమ గురించి మాట్లాడే అర్హత చంద్రబాబుకు లేదని, ఆ ప్రాంత ప్రాజెక్టులను అడ్డుకున్న సీమ ద్రోహి చంద్రబాబు అని ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం ఆయన హైదరాబాద్‌లో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. కన్నార్పకుండా అబద్ధాలు చెప్పడంలో చంద్రబాబును మించిన నాయకుడు లేదని, సత్యదూరమైన, నిజాయితీ లేని మాటలను అప్పటికప్పుడు అల్లి చెప్పడం ఆయన నైజమన్నారు. రాయలసీమ అభివృద్ధికి సీఎం జగన్ కంటే, తానే ఎక్కువ చేశానని చెప్పుకోవడానికి చంద్రబాబుకు అర్హత లేదన్నారు. రాయలసీమలో ఇరిగేషన్ ప్రాజెక్టులకు వ్యతిరేకంగా రైతులతో ప్రకాశం బ్యారేజీపై ధర్నా చేయించిన చంద్రబాబు... ఇవాళ ఇరిగేషన్‌పై మాట్లాడడం విడ్డూరమన్నారు. రైతులకు రుణమాఫీ చేస్తానని మోసం చేసిన దగ్గర్నుంచి ఏ ఒక్కటీ చేయకపోగా, వాళ్లను బాబు ఎంతగా ముంచాడో ఈ రాష్ట్రంలో ఉన్న ప్రతీ ఒక్కరికీ తెలుసన్నారు. 2004లో నాడు ఉమ్మడి రాష్ట్రంలో సీఎం అయిన వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో హంద్రీనీవా ప్రాజెక్టును పూర్తి చేశారని గుర్తుచేశారు. పులివెందులలో నిర్మించిన ప్రాజెక్టుల నుంచి రాయలసీమలో వివిధ ఇరిగేషన్ ప్రాజెక్టులు, హంద్రీనీవాపై నిర్మించిన జీడిపల్లి, గొల్లపల్లి, శ్రీనివాసపురం, అడివిపల్లి రిజర్వాయర్లు అన్నీ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఘనతేనని కొనియాడారు. ఉత్తరాంధ్రంలోనూ చాలా ప్రాజెక్టుల్ని పూర్తి చేసిన ఖ్యాతి వైఎస్ఆర్ కుటుంబానికే దక్కుతుందని వివరించారు. రాయలసీమకే గుండెకాయ వంటిది గండికోట రిజర్వాయర్‌పై నాడు చంద్రబాబు ఏమాత్రం శ్రద్ధ చూపకపోతే, ప్రస్తుతం దాన్ని 27 టీఎంసీలతో నింపుకునే సామర్థ్యాన్ని సీఎం వైఎస్ జగన్ కల్పించారని స్పష్టం చేశారు. పద్నాలుగేళ్ల చంద్రబాబు హయాంలో ఏ ఒక్క ప్రాజెక్టు కూడా తాను స్వయంగా రూపకల్పన చేసి పూర్తిచేసిన దాఖలాల్లేవని చెప్పారు.

**Tadepalligudem Municipality**
**Expression of Interest**
**Roc No.E1/1387/2023** **Dated: 26.07.2023**

Tadepalligudem Municipality Invites Expression of Interest (EoI) for **"Preparation of DPR for Comprehensive Water Supply Improvement Scheme for Jagananna Colonies in Tadepalligudem Municipality,** from the reputed consultancy firms who have experience in preparation of Water Supply **DPR's** and empaneled consultancy firms by **GoI or GOAP** with relevant experience.

The application for **EoI** document and proforma to be submitted along with EoI document may be obtained from Executive Engineer, Tadepalligudem Municipality - **Cell # 98499 06547, 9849907145** during the office hours from **28.07.2023 to 11.08.2023 up to 4.00PM** on payment of **Rs.5,000/-** DD in favor of **Commissioner, Tadepalligudem Municipality.**

The Last date for submission of EoI document along the details is **11.08.2023 up to 4.00 PM.**

**Commissioner,**
**Tadepalligudem Municipality**

**Tadepalligudem Municipality**
**Expression of Interest**
**Roc No.E1/1386/2023** **Dated: 26.07.2023**

Tadepalligudem Municipality Invites Expression of Interest (EoI) for **"Preparation of DPR for Comprehensive Water Supply Improvement Scheme in Tadepalligudem Municipality,** from the reputed consultancy firms who have experience in preparation of Water Supply **DPR's** and empaneled consultancy firms by **GoI or GOAP** with relevant experience.

The application for **EoI** document and proforma to be submitted along with EoI document may be obtained from Executive Engineer, Tadepalligudem Municipality - **Cell # 98499 06547, 9849907145** during the office hours from **28.07.2023 to 11.08.2023 up to 4.00PM** on payment of **Rs.5,000/-** DD in favor of **Commissioner, Tadepalligudem Municipality.**

The Last date for submission of EoI document along the details is **11.08.2023 up to 4.00 PM.**

**Commissioner,**
**Tadepalligudem Municipality**

సంపాదకీయం

# పేదరికం తగ్గిందా...!

దేశంలో ఎంతో అభివృద్ధి జరిగిందని, ఈ ఘనత అంతా ప్రధాని నరేంద్రమోదీదేనని పాలక పార్టీ బీజేపీ నేతలు ప్రచారం చేసుకుంటున్నారు. స్వయంగా ప్రధాని మోదీ అభివృద్ధి సాధించామని, దేశంలో పేదరికం తగ్గిందని ప్రకటించాక భజన రాయుళ్ల సొంత ప్రచార యంత్రాంగం విజృంభించి జనాన్ని నమ్మించడానికి పూనుకున్నాయి. ప్రభుత్వం వాస్తవ గణాంకాలను వెల్లడించడం లేదు. వృద్ధి జరిగింది వాస్తవమే. అయితే ఆ వృద్ధి అంతా నల్ల కుబేరులకే చేరింది. సామాన్య జనం పేదరికంలోనే కొట్టుమిట్టాడుతున్నారు. అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ సైతం ఈ విషయాన్ని ధృవీకరించింది. 2011 తర్వాత జరిగిన కాలంలో భారతదేశంలో పేదరికం తగ్గిందని చెప్పేందుకు తగిన ఆధారాలు కనిపించడంలేదని తాజా నివేదికలో వెల్లడించింది. ఇది అంతర్జాతీయ సంస్థ నివేదిక గనుక తాము నమ్మడంలేదని కూడా మన బీజేపీ ప్రభుత్వం వాదించే అవకాశాలు మెండుగా ఉంటాయి. పేదరికం తగ్గించడానికి అనేక సామాజిక సహాయ పథకాలను అమలు జరుపుతున్నందున పేదరికం తగ్గిందని కేంద్ర ప్రభుత్వం అంటోంది. కొవిడ్–19 దేశ ప్రజలను వణికించిన కాలంలో జాతీయ ఆహార భద్రతాచట్టం 2013 కింద 50 నుంచి 75శాతం గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో నివసించే పేదలకు ధాన్యం సరఫరా చేశామని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది, ఈ విషయాలు పరస్పర విరుద్ధంగా ఉన్నాయి. పేదరికం తగ్గినప్పుడు 75శాతం ప్రజలకు ధాన్యం సరఫరా చేయవలసిన అవసరం ఉంటుందా! అంటే పేదరికం తమ పాలనా కాలంలో గణనీయంగా తగ్గిందని ప్రధాని నరేంద్రమోదీ ప్రచారం చేయడం ఎన్నికల జిమ్మిక్ అనుకోవాలి. ఇలాంటి అసంబద్ధమైన అసత్య ప్రచారం చేసుకోవడం బీజేపీ ప్రభుత్వానికే చెల్లింది. కరోనా విజృంభించిన కాలంలో దేశంలో లక్షల్లో ప్రజలు మృత్యువుతో పోరాడుతున్నా మోదీ మాత్రం ఆనాడు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సేవలో వ్యవసాయాన్ని కార్పొరేట్లకు అప్పగించడానికి రైతు వ్యతిరేక మూడు నల్ల చట్టాలను పార్లమెంటులో ఆమోదింపచేసుకునే పనిలో తలమునకలై ఉన్నాడు. కరోనా దేశంలో ప్రవేశించిన శైశవ దశలోనే లాక్‌డౌన్ ప్రకటించి ప్రజలను అల్లకల్లోల పరచిన మోదీ పేదరికం తగ్గిందని ప్రకటించడం కేవలం బూటకమే. పైగా 21రోజుల్లో కరోనాను పూర్తిగా నిర్మూలిస్తామని ప్రకటించి నవ్వులపాలైన విషయం దేశప్రజలు ఇంకా మరిచిపోలేదు. కరోనా వైరస్ రుగ్మతలో తల్లడిల్లి పేదలు, దిగువ మధ్యతరగతి ప్రజలు ప్రభుత్వ, ప్రైవేటు ఆరోగ్యవ్యవస్థ అనామకంగా ఉండటం వల్ల ప్రైవేటు కార్పొరేట్ ఆస్పత్రుల యాజమాన్యం రోజు రోజుకు కోటి నుంచి పదికోట్లు ఆపైన సంపాదించారు. చికిత్సపేరుతో పేదలు చేసిన అప్పులు నేటికీ తీరలేదన్న విషయాన్ని ప్రభుత్వం నేటికీ అంగీకరించదు. పేదల సంఖ్య 25కోట్లకుపైగా ఉందని రిజర్వు బ్యాంకు తన అంతర్గత నివేదికలో పేర్కొన్నట్లు అనధికారిక సమాచారం. దేశ ఆర్థికవ్యవస్థ నేటికీ పూర్తిగా కోలుకోలేదు. మోదీ ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని నిర్లక్ష్యం చేసినప్పటికీ ఆహార ఉత్పత్తులు పెరిగి అభివృద్ధిలో తన పాత్రను ఇనుమడింప చేసింది.

కరోనాతో లక్షలాదిమంది ప్రాణాలు హరిస్తున్న కాలంలోనే కార్పొరేట్లకు లక్షా 45వేల కోట్ల రూపాయలు రాయితీలు ప్రకటించి నల్ల కుబేరులు ఎన్నికల ప్రచార సమయంలో కోట్లు విరాళాలు అందుకున్న బీజేపీ ప్రభుత్వం రుణం తీర్చుకున్నదని అనేకమంది విశ్లేషకులు వ్యాఖ్యానాలు చేశారు. భారతదేశం సహా ప్రపంచ పేదరికం రేటు 11శాతం పెరిగిందని ప్రపంచ బ్యాంకు తాజా నివేదిక తెలిపింది. అంతో ఇంతో పేదిరకం తగ్గినప్పటికీ కరోనా మహమ్మారి హరించివేసింది. అంతే కాదు దిగువ మధ్యతరగతి ప్రజల్లో కాస్త ఆదాయం పెరిగిందన్న సూచనలు తుడిచిపెట్టుకుపోయి ఇంకా అప్పులు పాలుచేసింది. వారి ఆర్థికపరిస్థితులు నేటికీ పుంజుకోలేదు. ఒకవైపు పేదరికం, మరోవైపు నిరుద్యోగం ఏనాడులేనంతగా అధికమైనప్పటికీ అభివృద్ధిలో దేశం పరుగెడుతోందని బీజేపీ పాలకులు నమ్మించేందుకు ప్రయత్నిస్తున్నారు. అవినీతి మరింతగా విస్తృతమైనప్పటికీ, దీన్నినిర్మూలించామని చెప్పడం మరింత హాస్యాస్పదంగా ఉంది.బ్యాంకుల్లో లక్షలు, కోట్ల రూపాయలు అప్పుతీసుకున్న బడాబాబులు అప్పులను తిరిగిచెల్లించకుండా విదేశాలకు వెళుతున్నారు. బ్యాంకుల్లో డిపాజిట్లు చేసే సామాన్య, దిగువ, మధ్య తరగతి ప్రజల కష్టార్జితమే ఇది. ప్రభుత్వాలు, బ్యాంకులు అప్పులు వసూలు చేసేందుకు కఠినచర్యలు తీసుకోకుండా వారు చెల్లించవలసిన అప్పులను రద్దు చేస్తున్నారు. కాంగ్రెస్‌ప్రభుత్వం కూడా అప్పులను రద్దు చేసింది. తాను అధికారంలోకి వస్తే బ్యాంకులను సంస్కరించి అప్పులు రద్దుచేసే పరిస్థితి లేకుండా చేస్తానని ఎన్నికల ప్రచారసభల్లో నరేంద్ర మోదీ వాగ్దానం చేశారు. ఈ వాగ్దానాన్ని అధికారంలోకి వచ్చిన తర్వాత మోదీ పూర్తిగా మరిచిపోయారు. మోదీ ప్రధానిగా పాలనా బాధ్యతలు చేపట్టిన తర్వాత 2014–15వ సంవత్సరం నుంచి 2023 మార్చి 31నాటికి 14.49లక్షల కోట్ల రూపాయలను అప్పులు ఎగవేసిన కార్పొరేట్లకు, పారిశ్రామికవేత్తల బకాయిలను రద్దు చేశారు. తాను సమర్థుడైన పాలకుడుగా ప్రచారం చేయించుకోవడానికి కాంగ్రెస్‌ను విమర్శిస్తున్నారు. గురువిందగింజ తన కిందవైపునఉన్న నలుపును చూడ లేనట్టుగానే తన అసమర్థపాలనను ఒప్పుకోకపోయినా కనీసం మార్చు కోవడంలేదు. దాదాపు నాలుగేళ్లకుపైగా పెరుగుతున్న నిత్యావసర ధరలు పెరుగుతున్నప్పటికీ వాటిని తగ్గించేందుకు మోదీ ప్రభుత్వం ఏ చర్య తీసుకోలేదు. ఆయన అధికారంలోకివచ్చే నాటికి గృహ వినియోగానికి అందించే గ్యాస్‌సిలిండర్ ధర 404రూపాయలుండగా అది నేడు పదకొండు వందల రూపాయలకు పైగా ఉంది. ఈ విధంగా వినియోగ దారులైన ప్రజలపైన భారం మోపారు. ఇలా అనేక విషయాలలో విఫలమైన మోదీ అసమర్థపాలన ప్రజలకు హాని చేసేదే.

# మళ్లీ ఆర్థికమాంద్యం ఛాయలు

మక్కెన సుబ్బారావు

ప్రపంచ ఆర్థికవ్యవస్థను ఆర్థికమాంద్యం ఛాయలు మళ్లీ ఆవహిస్తున్నాయి. అభివృద్ధిచెందిన అమెరికా, ఐరోపా దేశాల్లో వృద్ధిరేటు మందగింపులో ఉంది. వడ్డీరేట్లు పెరుగుతున్నాయి.పారిశ్రామిక, సేవలు, ఇతర ఆర్థికరంగాల్లో భయాందోళన మొదలైంది. సమాచార సాంకేతిక విజ్ఞానాన్ని విరివిగా వినియోగించే టెక్ కంపెనీలు వరుసబెట్టి ప్రకటిస్తున్న ఉద్యోగుల లేఆఫ్‌లే ఇందుకు నిదర్శనం. 1056 టెక్ కంపెనీలు 2022లో వివిధరంగాల్లో 1లక్ష 64వేల మంది ఉద్యోగులకు ఉద్వాసన పలికాయి. 2023లో తొలి ఆరునెలల్లోనే దాదాపు 2లక్షల మంది సిబ్బందికి గుడ్‌బై చెప్పాయి. పెద్ద ఎత్తున ఉద్యోగులను తొలిగించిన కంపెనీల్లో ట్విట్టర్ ప్రథమస్థానంలో ఉంది. అలెన్ మస్క్ ట్విట్టర్‌ను కొనుగోలు చేశాక రీ ఆర్గనైజేషన్ పేరుతో ముందుగా ఉద్యోగుల మెడపై కత్తిపెట్టారు. వాట్సప్, ఫేస్‌బుక్ వగైరా మాధ్యమాల అధిపతి కంపెనీ మెటా, అమెజాన్, మైక్రోసాఫ్ట్ ఆ తదుపరి వరుసలో ఉన్నాయి. అమెరికాలో ఐటి కంపెనీల్లో పనిచేస్తున్న వేలాదిమందిని ఉద్యోగాల నుంచి తొలగించడం, వారు ఆరు నెలల్లో మరేదైనా ఉద్యోగం సంపాదించుకోలేక పోతే, స్వదేశం వెళ్లిపోవాలని హోంలాండ్ డిపార్టుమెంట్ ప్రకటించడం కలకలం రేపటం చూశాం. పర్యవసానంగా మరికొన్ని నెలల సమయం పొడిగిస్తూ సడలింపులు ఇచ్చారు. అయినా విద్యార్జన నిమిత్తం మన దేశం నుంచి అమెరికా వెళుతున్నవారి సంఖ్య తగ్గకపోగా పెరుగుతూనే ఉంది. కారణం, ఇక్కడ ఉద్యోగ అవకాశాల లేమి, నిరుద్యోగం.

మన దేశంలో ఐటీరంగ పరిస్థితిని చూస్తే, అనేక కంపెనీలు ఈ ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికం (ఏప్రిల్–జూన్)లో సాధారణంగా కొత్తగా తీసుకునే ఉద్యోగుల సంఖ్యను గణనీయంగా తగ్గించుకున్నాయి. ఐటీ సర్వీసుల్లో అతిపెద్ద కంపెనీ అయిన టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టిసిఎస్) ఆచితూచి నిర్ణయాలు తీసుకుంటున్నది. జూన్ క్వార్టర్‌లో కొత్తగా 523 మంది ఉద్యోగులనే తీసుకుంది. సంవత్సరం క్రితం ఇదే కాలంలో 14,136 మందిని తీసుకుంది. అంటే రిక్రూట్‌మెంట్ 96శాతం తగ్గింది. విప్రో ఉద్యోగులసంఖ్య ఇదేకాలంలో 8812 తగ్గింది. హెచ్‌సిఎల్ ఉద్యోగులు 2,506 తగ్గారు. ప్రపంచ ఆర్థికమాంద్యం ఛాయల్లో వ్యాపార వాతావరణం స్థూలంగా మందకొడిగా ఉన్న నేపథ్యంలో కంపెనీలు పొదుపు చర్యలు ప్రారంభించాయి. పొదుపు అనగానే తొలి దెబ్బ పడేది ఉద్యోగులపైనే కదా! అదే సమయంలో, కంపెనీలు జనరేటింగ్ కృత్రిమమేధ (ఏఐ) వంటి కొత్త టెక్నాలజీలపై భారీగా పెట్టుబడులు పెడుతున్నాయి. రెండవ త్రైమాసికంలో రిక్రూట్‌మెంట్‌పై ఆశలు పెట్టుకునే అవకాశం కనిపించడంలేదు. కంపెనీలు ఈ సంవత్సరం క్యాంపస్ రిక్రూట్‌మెంట్‌లకు కూడా ఆసక్తి చూపడంలేదు. గత సంవత్సరాల్లో రిక్రూట్‌మెంట్ లెటర్లు పొందినవారిలో ప్రత్యేక నిపుణతలు కలిగినవారిని తీసుకునేందుకు కంపెనీలు పరిమితమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి.

2023 సంవత్సరానికి ఆయిలు ఉత్పత్తి అంచనాను అంతర్జాతీయ

ఇంధన (ఎనర్జీ) సంస్థ తగ్గించడం కూడా ఆర్థికమాంద్యం ఛాయలకు సంకేతం. ఆది ఆ విషయం స్పష్టంగానే చెప్పింది. కొవిడ్–19 కారణంగా 2020, 2021 సంవత్సరాల్లో ఆర్థిక కార్యకలాపాలు సన్నగిల్లి ఆర్థిక సంక్షోభం తలెత్తింది. అటు తర్వాత గత సంవత్సరం రష్యా–ఉక్రెయిన్ యుద్ధం ఆర్థికాభివృద్ధిని కృంగదీసింది. అది కొనసాగినంతకాలం మాంద్యం తప్పదు. ప్రపంచ పెద్దన్న అమెరికా సద్బుద్ధితో జోక్యం చేసుకుని ఉంటేయుద్ధం ఎప్పుడో సమసిపోయి ఉండేది. అయితే ఐరోపా ఖండంపై పూర్తి ఆధిపత్యం స్థిరపరచుకోవటం, రష్యాను ఆర్థికంగా, సైనికంగా నిర్వీర్యం చేయటమనే కుటిలబుద్ధితో అమెరికా పాలకులు యూరప్ దేశాలను నాటోకూటమి ఛత్రం కింద కూడదీశారు. ఉక్రెయిన్‌కు అధునాతన ఆయుధాలిస్తున్నారు. సైనికులకు శిక్షణ ఇస్తున్నారు. తాజాగా సరఫరా చేసిన క్లస్టర్ బాంబులు యుద్ధాన్ని విధ్వంసాన్ని తీవ్రతరం చేస్తాయి. ఉక్రెయిన్ నుంచి గోధుమల ఎగుమతి ఒప్పందం భగ్నమై నందున ప్రపంచంలో ఆహారకొరత మళ్లీ తలెత్తుతుంది. విలువైన మెటల్స్, ఎగుమతులు నిలిచిపోవటంతో పారిశ్రామిక దేశాల్లో ఉత్పత్తులకు తీవ్రమైన అంతరాయం ఏర్పడుతుంది. మరోవైపు, ప్రపంచ వస్తు ఉత్పత్తి కేంద్రంగా ఉన్న చైనా పురోగతికి మోకాలడ్డి దెబ్బకొట్టే ప్రయత్నంలో అమెరికా సామ్రాజ్యవాద పాలకులు జగడం పెంచుకుంటున్నారు. ఇవన్నీ ఆర్థిక మాంద్యానికి హేతువవుతున్నాయి. ఉక్రెయిన్‌ను నాటోలో చేర్చుకునే యత్నాలు విరమించుకుని, ఐరోపా భద్రతను సరికొత్త ఒప్పందానికి అమెరికా సిద్ధపడితే యుద్ధం ముగుస్తుంది. యూరప్‌కు రష్యా ఆయిలు, గ్యాస్ సరఫరా పూర్తిస్థాయిలో పునరుద్ధరణ జరిగితే వాటి ఆర్థిక, పారిశ్రామిక కార్యకలాపాలు, ప్రజల జీవన స్థితిగతులు కుదుటబడతాయి. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలు ఊపిరి పీల్చుకుంటాయి. ఆర్థిక సంక్షోభం, మాంద్యాల వలన సామాన్య, మధ్య తరగతి ప్రజలు జీవితాలే. గుత్త పెట్టుబడిదారులు, వారి బహుళజాతి కంపెనీల లాభాలు పెరుగుతూనే ఉంటాయి. ప్రపంచ స్టాక్ మార్కెట్‌వృద్ధి ఇందుకు సాక్ష్యం. కొవిడ్ కాలంలో ప్రపంచ దేశాలన్నీ కుదేలైతే స్టాక్ మార్కెట్ నిలకడగా ఎగబాకుతూనే ఉన్నాయి. మన దేశ స్టాక్ మార్కెట్లు ఈ మూడేళ్లలో దాదాపు 20వేల పాయింట్లు పెరిగాయి. డబ్బుకు డబ్బు సంపాదించే ఈ కృత్రిమ మాయాజాలంలో సూచీలు పతనమైనప్పుడల్లా దెబ్బతినేది ఎక్కువగా మధ్యతరగతి మదుపుదారులే కదా!

**విచిత్రమైన స్థితిలో భారత్**

మన దేశం 2030 నాటికి ప్రపంచంలో మూడవ, 2040 నాటికి రెండవ అతి పెద్ద ఆర్థికవ్యవస్థగా వృద్ధి చెందుతుందని ప్రచారంచేస్తూ, అదంతా 'విశ్వగురు' నరేంద్ర మోదీ మహిమగా వందిమాగధులు ప్రచారం చేస్తున్నప్పటికీ, రానురాను మేధోవలసలతోపాటు పెట్టుబడి కూడా వలసపోతోంది. మన ఆర్థికవ్యవస్థ అవసరాలమేరకు నిపుణులైన శ్రామికులు తయారుకావడం లేదు. 2022లో ఉన్నత విద్యకోసం విదేశాలకు వెళ్లిన భారతీయుల సంఖ్య 7.5 లక్షలు దాటిందని ప్రభుత్వం చెబుతోంది. అది చాలదన్నట్లు 10లక్షల డాలర్లు, ఆపై పెట్టుబడి పెట్టగలిగిన సంపన్నులు కూడా వలస వెళుతున్నారు. ప్రస్తుతం విదేశాల్లో స్థిరపడిన అటువంటి సంపన్న భారతీయులు 344,600 అట!

రాయితీలు కుమ్మరించి విదేశీ పెట్టుబడులు రాబట్టవచ్చు. కాని అట్టి పరిశ్రమలకు అవసరమైన నిపుణ కార్మికుల కొరత తీర్చటమెలా? మన దేశంలో ప్రతి నలుగురు మేనేజిమెంట్ పట్టభద్రుల్లో ఒకరు, ప్రతి ఐదుగురు ఇంజినీరింగ్ పట్టభద్రుల్లో ఒకరు మాత్రమే ఉద్యోగాలకు తగిన నైపుణ్యాలు కలిగి ఉన్నట్లు ప్రపంచ ఆర్థిక వేదిక ప్రకటించింది. కార్మిక శ్రేణుల్లో 4.9శాతమే నైపుణ్యశిక్షణ పొందారు. అది దక్షిణకొరియాలో 96శాతం, జపాన్ 80శాతం, జర్మనీ 75శాతం, బ్రిటన్ 68శాతం, అమెరికా 52శాతం, చైనా 24శాతం నైపుణ్యకార్మికులను అందించడంలో మనం ఎక్కడ ఉన్నామో, ఎంత వేగంగా చర్యలు తీసుకోవాలో మదింపునకుఈ సంఖ్యలు ఉపకరిస్తాయి. మోదీ ప్రభుత్వం 2015లో జాతీయ నైపుణ్య వ్యవస్థాపక వృద్ధి విధానం ప్రకటించింది. 2015లో ప్రారంభించిన ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన అమలుకు 2008లో నెలకొల్పిన జాతీయ నైపుణ్యాభివృద్ధి సంస్థకు అప్పగించారు. అన్ని పథకాల బహిరంగ ప్రకటనల్లాగే దీని అమలు అరకొరే. దీనికంత శిక్షణ పొందినవారు1.37కోట్ల మంది కాగా, నైపుణ్య ధృవపత్రాలు పొందిన ప్రతినలుగురిలో ఒక్కరికే 2023 మార్చి 14నాటికి ఉద్యోగం లభించినట్లు గణాంకాలు తెలుపుతున్నాయి. (మూలం ఈనాడులో వ్యాసాలు జులై 15,19 తేదీలు రచయితలు డా.ఎస్.వి.ఆర్ జ్యోతీ కుమార్, శ్రీరామ్ చేకూరి) శిక్షణ కోర్సులను మొక్కుబడిగా కేవలం 8 గంటల్లో ముగిస్తున్నారట. మన దేశానికి ఏటా 20వేల మంది నిపుణ శిక్షకులు అవసరం కాగా ప్రస్తుతం 8268 మంది తయారవుతున్నారట. వచ్చే 15ఏళ్లలో కొత్తగా 18కోట్ల మంది యువత భారతదేశం కార్మికశ్రేణుల్లో ప్రవేశిస్తారని అంచనా. ఇప్పటికైనా నైపుణ్యాభివృద్ధిపై తక్షణం శ్రద్ధాపూర్వక దృష్టి పెట్టకపోతే ఆర్థికాభివృద్ధి ఆశలు, ఊహలు నెరవేరవు.

**కొసమెరుపు:** ఎల్ఐసీలో పనిదినాలను వారానికి ఐదు రోజులకు తగ్గించినట్లు, ఇకపై బ్యాంకులు అదేబాట పట్టే సూచనలున్నాయి. డిజిటల్ లావాదేవీలు పెంపుదలకు ఇదో మార్గం కాబోలు.

సీనియర్ జర్నలిస్టు

# బీజేపీ చేతిలో పావు తమిళనాడు గవర్నర్

ఎస్. సేతురామన్



డీఎంకే భావజాలంపై స్టాలిన్ ప్రభుత్వ విధాన నిర్ణయాలపై గవర్నర్ ఆర్.ఎస్ రవి కొనసాగిస్తున్న దాడిపై కొంతకాలంగా జరుగుతున్న ఘర్షణ తెలిసిందే. ఆ మాట కొస్తే తమ దిల్లీ బాస్ ఆదేశాల ప్రకారం, ప్రతిపక్షపార్టీలు అధికారంలో ఉన్న చాలా రాష్ట్రాల్లో పరిపాలనా వ్యవహారాలు సాఫీగా సాగకుండా ఆటంకాలు కల్పిస్తున్న గవర్నర్ రవి ఒక్కరే కాదు. ముఖ్యమంత్రి ఎం.కె స్టాలిన్ గవర్నర్ వ్యవహారాన్ని ఆయన నియామక అధికారి అయిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము దృష్టికి తీసుకెళుతూ లేఖరాసి అతను "పాక్షిక దృష్టితో పనిచేస్తున్నాడు, గవర్నర్ పదవికి తగడు" అని ఫిర్యాదు చేశారు. రవిని కొనసాగించడం 'వాంఛనీయమా, సబబా' అనే విషయ నిర్ణయాన్ని ఆయన రాష్ట్రపతి విజ్ఞతకు విడిచిపెట్టారు.

అయితే గవర్నర్ రవి డిఎంకెతో, ప్రభుత్వంతో ఎందుకు కజ్జాలు పెట్టుకుంటున్నారన్నది ఆలోచించదగ్గ అంశం. గత ఏఐఏడిఎంకె ప్రభుత్వానికి పెద్దగా వ్యవహరిస్తూ రాజకీయ లబ్ధిపొందడానికి బీజేపీ చేసిన ప్రయత్నాలు ఫలితమివ్వలేదు. 2019 లోకసభ ఎన్నికల్లో రాష్ట్రం నుంచి 39 స్థానాలకుగాను 25 స్థానాలను డీఎంకె గెలుచుకుంది. బీజేపీకి ఒక్కటి కూడా దక్కలేదు. 2021 అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ జీరో నుండి 4 స్థానాలు గెలుచుకుంది. బీజేపీని విస్తరించే సాధనంగా ప్రధాని మోదీ ఒక ఎమ్మెల్యేని కేంద్రమంత్రి వర్గంలోకి తీసుకున్నారు. బీజేపీ, మోదీ లక్ష్యం 2024 సార్వత్రిక ఎన్నికల్లో డీఎంకెని దెబ్బతీయటం. గవర్నర్‌గా రవిని నియమించింది లగాయతు ఆయన డీఎంకె భావజాలంపై దాడి మొదలు పెట్టారు. డీఎంకె సామాజిక న్యాయ సిద్ధాంతం. కేంద్రం తన కేంద్రీకృత విధానానికి అనుగుణంగా తెచ్చిన నూతన విద్యావిధానాన్ని డిఎంకె ప్రభుత్వం అమలు జరపటంలేదు. దాన్ని అమలు జరిపించడానికి గవర్నర్ ప్రయత్నించారు. హిందీ భాషను విధించే ప్రయత్నాలకు వ్యతిరేకంగా, తమిళ భాషాభిమానాన్ని ఆయుధంగా ప్రయోగించి ఆందోళనలు నిర్వహించడం డిఎంకె మూలాల్లోనే ఉంది.

వచ్చే లోకసభఎన్నికల్లో మూడింట రెండువంతుల మెజారిటీ సాధించడం, తమ "ఒకే దేశం" (హిందూ దేశం) సిద్ధాంతానుసారం 2047 (స్వాతంత్ర్య శతవత్సరం) నాటికి అటువంటి సమాజ పరివర్తనకు అవసరమైనమార్పులు రాజ్యాంగంలో తీసుకురావడం బీజేపీ లక్ష్యం. ద్రావిడ భావజాలం కలిగిన డీఎంకె విధానాలు ముఖ్యంగా సామాజిక రంగంలో మోదీ ప్రభుత్వ విధానాలతో పొసగనివి. కాబట్టి డీఎంకె భావజాలాన్ని తక్కువచేయడానికి, డీఎంకెయేతర తరగతుల్లో (బ్రాహ్మణులు తదితర అగ్రవర్ణాలు) బీజేపీపై పట్టు బిగించడానికి గవర్నర్‌ను పావుగా వాడుకుంటున్నది. వచ్చే ఎన్నికల్లో తమిళనాడులో స్వయంగా, తమ మిత్రపక్షాలు కొన్ని సీట్లు సాధించడం తక్షణ వ్యూహం.

గవర్నర్ యూనివర్సిటీల ఛాన్సలర్ల నియామకం, తదితర అంశాల్లో అసెంబ్లీ అమోదించిన బిల్లులకు ఆమోదం తెలపకుండా తొక్కిపెట్టారు. తమిళనాడు పేరునే ప్రశ్నించారు. "నాడు" అంటే స్వతంత్రదేశం అనే అర్థం వస్తుంది కాబట్టి దాన్ని 'తమిళగ' లాంటి పేరుకు మార్చాలన్నారు. తమిళనాడు పేరుపట్ల తమిళులకున్న మక్కువకు ఒక ఉదాహరణ. 1967లో అన్నాదురై నాయకత్వంలో తొలి డిఎంకె ప్రభుత్వం అధికారం చేబట్టాక మద్రాసురాష్ట్రం పేరును 'తమిళనాడు'గా మార్చుతూ పార్లమెంటులో రాజ్యాంగసవరణబిల్లు ప్రవేశపెట్టారు. దానిలో 'తమిళనాడ్' అని ఉంది. దాన్ని ఆమోదించిన వెంటనే తమిళుల నుండి ఆగ్రహావేశాలు వ్యక్తం కావటంతో 'నాడ్'ను, 'నాడు'గా సవరిస్తూ మరో రాజ్యాంగం సవరణ బిల్లు ఆమోదించాల్సి వచ్చింది. అంతటి తీవ్రమైన మనోభావాన్ని ఈ గవర్నర్ గెలికతే సహిస్తారా? అంతేకాదు, శాసనసభనుద్దేశించి గవర్నర్ చదివే ప్రసంగపాఠం (ఇది మంత్రివర్గం తయారుచేసి ఇస్తుంది)లో 'ద్రవిడ పాలనా నమూనా'పై ఉన్న భాగాన్ని గవర్నర్ రవి చదవకుండా దాటవేశాడు. ఇది కచ్చితంగా రాజ్యాంగ సూత్రాల ఉల్లంఘన.

రాష్ట్రమంత్రి సెంథిల్ బాలాజీ మనీలాండరింగ్ ఆరోపణతో ఈడీ కేసు ఎదుర్కొంటున్న కారణాన ఆయన్ను గవర్నర్ మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయటంతో గవర్నర్ ప్రభుత్వం మధ్య వైరుధ్యం తారాస్థాయికి చేరింది. మంత్రుల నియామకం లేదా తొలగింపును ముఖ్యమంత్రి సిఫారసుకై గవర్నర్ చేయాలితప్ప స్వతంత్రంగా చర్య తీసుకునే అధికారం రాజ్యాంగం గవర్నర్‌కు ఇవ్వలేదు. ఈ చర్యపై రాజ్యాంగ నిపుణుల నుంచి, రాజకీయ పార్టీలనుంచి తీవ్రమైన విమర్శలు వచ్చిన మీదట గవర్నర్ తన చర్యను ఉపసంహరించుకున్నారు. అది వేరు విషయం. ప్రభుత్వం సెంథిల్‌ను ఏ పోర్టుఫోలియో లేని మంత్రిగా కొనసాగిస్తున్నది.

తమిళ సమాజంలోని కొన్ని విభాగాలను లోకసభ ఎన్నికల్లో మోదీకి అనుకూలంగా ఆకర్షించే నిమిత్తం గవర్నర్ రవి తమ ప్రకటనలు, ప్రవచనాల్లో హిందు ధర్మాలు ప్రభోదిస్తున్నారు. "ఒక దేశం, ఒక చట్టం, ఒక భాష(హిందీ)" అనే బీజేపీ –ఆర్ఎస్ఎస్ విధానాన్ని నెమ్మదిగా, మెత్తగా తమిళులచే మింగించాలని చూస్తున్నారు. నాగాలాండ్ గవర్నర్‌గా రవి పాత్ర విస్మరించలేనిది. అక్కడినుండి తమిళనాడు వచ్చారు. తనకు అప్పగించిన బాధ్యతలు నెరవేర్చడానికి శాయశక్తులా కృషిచేస్తున్నారు. ఏఐఏడీఎంకె మాజీ మంత్రులెవర్నీ "సీబీఐ అభ్యర్థన" మేరకు ప్రాసిక్యూట్ చేయడానికి డీఎంకె ప్రభుత్వం కోరినా అనుమతి ఇవ్వకుండా ఫైలు తొక్కిపెట్టిన గవర్నర్ చర్య ఎవరి మెప్పుకోసమో ఊహించడం కష్టంకాదు. అతని రాజకీయ పక్షపాతాన్ని ఇది తెలియజేస్తున్నదని ముఖ్యమంత్రి స్టాలిన్ రాష్ట్రపతి దృష్టికి తెచ్చారు.

# హానికరమైన జీవవైవిధ్య అటవీచట్టాలు

డా. సోమ మర్ల

ఇటీవల పార్లమెంటులో ప్రవేశపెట్టి, ఆమోదించిన జీవ వైవిధ్య అటవీ చట్టాలు పర్యావరణానికి గిరిజనుల హక్కులకు తీవ్రహాని కలిగిస్తాయి. రక్షిత (రేంజి) అడవులతో సహా భూములలో అరుదైన వనమూలికలు సేకరణకు, గనుల తవ్వకానికి, పర్యాటక, రియల్ ఎస్టేట్ వ్యాపారులకు, ఔషధ కంపెనీలకు అనుమతులను ఇచ్చే ఈ రెండు బిల్లులు వివాదాస్పదమైనవి. హానికరమైన ఈ బిల్లులను మణిపూర్ సమస్యపై అట్టుడుకుతున్న పార్లమెంటులో వివాదం గందరగోళం మధ్యలో ఏ మాత్రం చర్చలేకుండా ఏకపక్షంగా ప్రస్తుత బీజేపీ ప్రభుత్వం లోకసభ ఆమోదాన్ని పొందడం విచారకరం. అడవుల భూమిపై మానవాళికి అత్యవసరమైన ఆక్సిజన్ వాయువుని 40శాతం విడుదల చేస్తాయి. కర్బన వాయువుని ఇతర హరిత గృహ వాయువుల్ని పీల్చుకుని విశ్వానికి ఊపిరితిత్తుల వలె ఉపయోగపడుతున్నాయి. పైగా తులసి, అశ్వగంధి, అడవి ఉసిరి వంటి అనేక అనువైన వనమూలికలు, మనం ఆహారంలో వినియోగించి వివిధ పంటలకు మూలమైన అడవి పంటలు అడవుల్లోనే లభిస్తాయి. పర్యావరణానికి, జీవ వైవిధ్యానికి పుట్టినిల్లయిన అడవుల్లోకి ప్రైవేటు ఔషధ (దేశీయ, విదేశీ బహుళ జాతి) కంపెనీలను, గనుల యజమానులకు అటవీ భూములను ధారాదత్తం చెయ్యటం ఈ రెండు చట్టాల సారాంశం.

ప్రస్తుత, గతప్రభుత్వాలు అమలు చేస్తున్న సరళీకరణ ఆర్థిక సంస్కరణలో భాగంగా ఇప్పటికే ప్రజల ఆస్తులైన ప్రభుత్వరంగ పరిశ్రమలు, విమానాశ్రయాలు, నౌకాశ్రయాలు, విద్య, వైద్యాలను బడా పారిశ్రామిక వేత్తలకు కట్టబెట్టినది చాలక ప్రస్తుతం అడవుల్ని సైతం ప్రైవేటుపరం చేయడం జాతికి తీవ్ర హానికరం. పార్లమెంటులో ప్రవేశపెట్టిన జీవ వైవిధ్య, అటవీ చట్టాల్లో సెక్షన్6(1ఏ) 1బి క్లాజుల ప్రకారం రక్షిత (రేంజి) ప్రాంతాలతో సహా అన్ని అడవుల్లోకి అరుదైన వనమూలికలు సేకరణకు, గనుల తవ్వకాలకు, పర్యాటకానికి, హోటళ్ల నిర్మాణాలకు భూములివ్వటానికి మొట్టమొదటగా అవకాశం లభించింది. ఇది కాకుండా ఐరాస జీవ వైవిధ్య సదస్సు సిఫారసులలో ప్రధానమైనది ఆర్టికల్ 5 ప్రకారం అడవుల్లో నివాసం ఉండే గిరిజనులకు ఈ ప్రాంతం నుండి సేకరించే వనమూలికలు, అటవీ ఉత్పత్తులు, గనుల నుండి తవ్వే ఖనిజాలపై లభించే అదాయంలో కొంత భాగం విడిగా కేటాయించాలి. ఈ నిధులు గిరిజన ప్రాంతాల్లో పాఠశాలలు, ఆస్పత్రులు, రోడ్లు తదితర అవసరాలకు వినియోగించాలి. దీనికి తప్పనిసరిగా గ్రామసభ, జిల్లా, రాష్ట్ర వైవిధ్య బోర్డుల అనుమతులు తప్పనిసరి. ఈనాడు ఆమోదించిన జీవవైవిధ్య అటవీ చట్టాలు గిరిజనులకు లభించే ఈ ప్రయోజనాలను పూర్తిగా హరిస్తాయి. అలాగే అటవీ ప్రాంతాల్లో నివసించే గిరిజనులకు అక్కడి భూములపై శాశ్వత హక్కులుండేవి కావు. కాగా కమ్యూనిస్టుపార్టీలు, వివిధ వామపక్ష గిరిజన హక్కుల సంఘాల పోరాటాల ఫలితంగా, 2006లో అప్పటి యూపీఏ ప్రభుత్వం కమ్యూనిస్టుల చొరవతో 'అటవీ హక్కు చట్టం 2006' ని ఆమోదించింది. కాగా ప్రస్తుతం పార్లమెంటు ఆమోదించిన అటవీచట్టాలు గిరిజనుల హక్కులను పూర్తిగా విస్మరించి వారిని అడవుల నుంచి గెంటివేసే అవకాశం కలదు.

రామ్‌దేవ్‌బాబాకు చెందిన ఉత్తరాఖండ్‌లోని దివ్య ఫార్మాస్యూటికల్స్ అనే ఔషధ సంస్థ 2014 నుండి 2017 మధ్య ఎలాంటి ప్రభుత్వ, గ్రామ సభల అనుమతుల్లేకుండా ప్రవేశించి అరుదైన, విలువైన ఎన్నో హిమాలయ వనమూలికలను అటవీ ప్రాంతాల నుండి తస్కరించంది. దీనిపై 2018 వ సంవత్సరంలో ఉత్తరాఖండ్ హైకోర్టు సైతం ఈ ఔషధ కంపెనీకి భారీ జరిమానా విధించింది. కాగా ప్రస్తుత చట్టాలు రామ్‌దేవ్‌బాబాకు చెందిన పతంజలికే కాక అనేక దేశీయ, విదేశీ బహుళజాతి ఔషధ కంపెనీలకు ద్వారాలు తెరుస్తుంది. ఈ కంపెనీలకు సదుపాయంగా దేశంలోని పేటెంటు చట్టాలను సైతం సరళీకృతం చేశారు. గత రెండు దశాబ్దాలుగా వేప, పసుపు, బస్మతి బియ్యం వగైరాలపై పేటెంటు యాజమాన్య హక్కులు పొందడానికి విదేశీ ఔషధ బహుళజాతి సంస్థలు చేసిన ప్రయత్నాల గురించి వేరేచెప్పనక్కరలేదు. కాగా మన దేశ ప్రజలే, న్యాయస్థానాల సముచిత ప్రతిఘటనతో మన దేశ జీవ వనరుల తస్కరణ నివారించారు.. తాజాగా చేసిన ఈ రెండు చట్టాల వలన గిరిజనులకు, పర్యావరణానికి కలిగే హాని గురించి, పార్లమెంటు జాయింటు పార్లమెంటరీ కమిటి(పర్యా వరణం, అడవుల విభాగం) ఫిర్యాదులు స్వీకరించింది. వ్యాసకర్త 2022 మార్చిలో జన విజ్ఞాన వేదిక ప్రతినిధిగా పార్లమెంటు కమిటీ ముందు హాజరై ఈ చట్టాల వలన కలిగే నష్టాన్ని వివరించారు. అదేవిధంగా చత్తీస్‌ఘడ్, జార్ఖండ్, గద్వాల్ (ఉత్తరాఖండ్) కు చెందిన గిరిజనులు సైతం ఈ చట్టాల్లోని మార్పులకు వ్యతిరేకంగా తమ నిరసనలను తెలియజేశాయి. అయినా ఈ విజ్ఞప్తులను పట్టించుకోకుండా కేంద్ర పర్యావరణ, అటవీశాఖ మంత్రి ఈ జాతి వ్యతిరేక చట్టాలను చేయటం విచారకరం. అటవీ సంరక్షణను, జీవ వైవిధ్య రక్షణకున్న క్లాజులను, అంశాలను విస్మరించి పూర్తిగా బడా పారిశ్రామికవేత్తల ప్రయోజనాల కోసం చేసిన ప్రస్తుత జీవవైవిధ్య, అటవీ చట్టాలు చాలా ప్రమాదకరమైనవి. వృక్షాల నరికివేతలతో అటవీ ప్రాంతం కుచించుకు పోవడం వలన భూతాపం పెరిగి పర్యావరణానికి తీవ్రమైన హాని కలుగుతుంది. ఈ నూతన చట్టాల అమలు ద్వారా గిరిజనుల, పోడు భూముల యాజమాన్యపు హక్కులు పూర్తిగా హరించి వేశాయి. ఈ చట్టాలను గిరిజనులతో సహా అన్ని హక్కుల సంఘాలు తీవ్రంగా ప్రతిఘటించాలి.

# ఇటు గొడవ - అటు బిల్లులు

## జమ్ముకశ్మీర్ పునర్వ్యవస్థీకరణ సహా ఆరు బిల్లులు ప్రవేశం

న్యూఢిల్లీ : మణిపూర్‌లో హింసపై ప్రతిపక్ష సభ్యుల నిరసనల నడుమ బుధవారం లోక్‌సభలో జమ్ముకశ్మీర్ పునర్వ్యవస్థీకరణ చట్టం సవరణకు ఒక బిల్లు సహా ఆరు బిల్లులను ప్రభుత్వం ప్రవేశపెట్టింది. పత్రాలు సమర్పించిన వెంటనే, స్పీకర్ ఓం బిర్లా జననాలు, మరణాల నమోదు (సవరణ) బిల్లు, 2023ని ప్రవేశపెట్టాలని హోం శాఖ సహాయ మంత్రి నిత్యానంద్ రాయ్‌ను కోరారు. కాంగ్రెస్‌కు చెందిన మనీశ్ తివారీ బిల్లును ప్రవేశపెట్టడాన్ని వ్యతిరేకించారు. అలా చేయడానికి సభకు 'శాసనసభ సామర్థ్యం' లేదని తెలిపారు. ఈ చర్య గోప్యత, అధికార విభజన హక్కును ఉల్లంఘిస్తుందన్నారు. అనంతరం మూజువాణి ఓటు ద్వారా బిల్లును ప్రవేశపెట్టారు. తర్వాత నరేంద్ర మోదీ ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానాన్ని సభ చేపట్టింది. ఆ తర్వాత మణిపూర్ అంశంపై ప్రతిపక్ష సభ్యుల నినాదాల మధ్య మరో ఐదు బిల్లులను ప్రవేశపెట్టారు. మంత్రి నిత్యానంద రాయ్ జమ్ముకశ్మీర్ రిజర్వేషన్ (సవరణ) బిల్లు-2023ని ప్రవేశపెట్టడానికి ముందుకొచ్చారు. బిల్లును ప్రతిపక్ష సభ్యులు ఎవరూ వ్యతిరేకించకుండా మూజు వాణి ఓటు ద్వారా ప్రవేశపెట్టారు. జమ్ముకశ్మీర్ పునర్వ్యవస్థీకరణ (సవరణ) బిల్లు, 2023ని కూడా రాయ్ మూజు వాణి ఓటుతో ప్రవేశపెట్టారు. నేషనల్ కాన్ఫరెన్స్‌కు చెందిన హస్నైన్ మసూది పునర్వ్యవస్థీకరణ చట్టం 'రాజ్యాంగపరంగా అనుమానిత చట్టం' అని పేర్కొంటూ ఈ బిల్లును ప్రవేశపెట్టడాన్ని వ్యతిరేకించారు. సుప్రీం కోర్టు ఈ అంశాన్ని పరిశీలిస్తున్నందున ఈ అంశం సబ్ జడ్జియేనని, న్యాయ పరిశీలనలో ఉన్న చట్టాన్ని సవరించడం రాజ్యాంగ ఔచిత్యానికి విరుద్ధం' అని అన్నారు. సామాజిక న్యాయం, సాధికారత మంత్రి డాక్టర్ వీరేంద్ర కుమార్, గిరిజన వ్యవహారాల శాఖ మంత్రి అర్జున్ ముండా వరుసగా రాజ్యాంగం (జమ్ముకశ్మీర్) షెడ్యూల్డ్ కులాల ఆర్డర్ (సవరణ) బిల్లు-2023, రాజ్యాంగం (జమ్ముకశ్మీర్) షెడ్యూల్డ్ తెగల ఆర్డర్ (సవరణ) బిల్లు-2023ని ప్రవేశపెట్టారు. రాజ్యాంగం (జమ్ముకశ్మీర్) షెడ్యూల్డ్ కులాల ఆర్డర్ బిల్లు 2023 జమ్ముకశ్మీర్‌లోని షెడ్యూల్డ్ కులాల జాబితాలో వాల్మీకి సామాజిక వర్గాన్ని చురా, భంగి, బాల్మీకి, మెహతార్‌కు పర్యాయపదంగా చేర్చాలని కోరింది. ఈ బిల్లు జమ్ముకశ్మీర్‌లో షెడ్యూల్డ్ తెగల జాబితాను సవరించడం లక్ష్యంగా ఉంది. కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి గనులు, ఖనిజాల (అభివృద్ధి, నియంత్రణ) సవరణ బిల్లు-2023ను ప్రవేశపెట్టారు. రివల్యూషనరీ సోషలిస్ట్ పార్టీకి చెందిన ఎన్.కె.ప్రేమచంద్రన్ వీటిని ప్రవేశపెట్టడాన్ని వ్యతిరేకిస్తూ, ఇది సమాఖ్య సూత్రానికి విరుద్ధమని అన్నారు. ఇది ప్రభుత్వ రంగ సంస్థలతో పాటు దేశ భద్రతపై ప్రతికూల ప్రభావం చూపుతుందని ఆయన అన్నారు. సవరణ బిల్లు వల్ల బహుళ జాతి సంస్థలు లాభపడతాయన్నారు. గనులు, ఖనిజాల చట్ట సవరణకు సంబంధించి పార్లమెంటు శాసన సామర్థ్యంపై ఎలాంటి అభ్యంతరాలు లేవని జోషి అన్నారు. మూజు వాణి ఓటు అనంతరం బిల్లును ప్రవేశపెట్టారు.

### అటవీ పరిరక్షణ చట్టం సవరణ బిల్లు

అటవీ పరిరక్షణ చట్టాల పరిధి నుంచి దేశ సరిహద్దులకు 100 కి.మీ. లోపు భూమిని మినహాయించాలని, అటవీ ప్రాంతాల్లో జంతు ప్రదర్శన శాలలు, సఫారీలు, ఎకో టూరిజం సౌకర్యాల ఏర్పాటుకు అనుమతి ఇచ్చే బిల్లును లోక్‌సభ బుధవారం ఆమోదించింది. అటవీ (పరిరక్షణ) సవరణ బిల్లు-2023 స్వల్ప చర్చ తర్వాత ఆమోదం పొందింది. దీనిని పర్యావరణ మంత్రి భూపేందర్ యాదవ్ ప్రవేశపెట్టారు. మణిపూర్‌లో జాతి హింసపై ప్రతిపక్ష భ్యుల నిరసనల మధ్య అటవీ (పరిరక్షణ) చట్టాన్ని సవరించే బిల్లు ఆమోదం పొందిన మరుసటి రోజు లోక్‌సభ వాయిదా పడింది.

ఈ బిల్లు చట్టంలోని నిబంధనల నుంచి కొన్ని రకాల భూమిని మినహాయించింది. ఉదాహరణకు రైలు మార్గం వెంబడి అటవీ భూమి లేదా ప్రభుత్వం నిర్వహించే ప్రజా రహదారి నివాసాలకు లేదా రైలుకు, రహదారి పక్కన సౌకర్యాన్ని గరిష్ఠంగా 0.10 హెక్టార్ల వరకు అందిస్తుంది. జాతీయ ప్రాముఖ్యత లేదా భద్రత కోసం వ్యూహాత్మక సరళ ప్రాజెక్టుల నిర్మాణం కోసం ప్రతిపాదించబడిన అంతర్జాతీయ సరిహద్దులు, నియంత్రణ రేఖ లేదా వాస్తవ నియంత్రణ రేఖ వెంబడి 100 కి.మీ.లోపు ఉన్న భూమి కూడా మినహాయించబడే అటవీ భూమి. వామపక్ష తీవ్రవాద ప్రభావిత ప్రాంతంలో ఐదు హెక్టార్లకు మించకుండా కేంద్ర ప్రభుత్వం పేర్కొన్న విధంగా రక్షణ సంబంధిత ప్రాజెక్టులు, పారామిలటరీ బలగాల క్యాంపు లేదా ప్రజా వినియోగ ప్రాజెక్టుల నిర్మాణం కోసం ప్రతిపాదించిన భూమి, భద్రతా సంబంధిత మౌలిక సదుపాయాల నిర్మాణం కోసం ప్రతిపాదించబడిన 10 హెక్టార్ల వరకు భూమిని కూడా మినహాయించింది.

## ఇతర దేశాల ఆహార ధరల్లో అస్థిరత

### భారత్‌లో బియ్యం ఎగుమతుల నిషేధంపై ఐఎంఎఫ్

న్యూఢిల్లీ: బియ్యం ఎగుమతులపై భారత్ నిషేధం విధించింది. భారత్ నిర్ణయం ప్రపంచంలోని ఇతర దేశాలలో ఆహార ధరలపై అస్థిరతను పెంచేలా ఉందని అంతర్జాతీయ ద్రవ్య నిధి సంస్థ (ఐఎంఎఫ్) పేర్కొంది. ఇవి ప్రతీకార చర్యలకు దారితీయవచ్చని చెప్పారు. ఈ రకమైన ఎగుమతులపై పరిమితులను తొలగించాలని భావిస్తామని, లేకపోతే ఇవి ప్రపంచవ్యాప్తంగా విపత్కర పరిస్థితులకు దారితీయవచ్చని ఐఎంఎఫ్ ముఖ్య ఆర్థికవేత్త, డైరెక్టర్ పియర్ -ఒలివర్ గౌరించస్ పేర్కొన్నారు. ప్రపంచ ఆర్థిక వేదికను ప్రారంభించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. కొన్ని రకాల బియ్యం ఎగుమతులపై ఆంక్షలు విధించడం...అది ప్రపంచవ్యాప్త ద్రవ్యోల్బణంపై తీవ్ర ప్రభావం పడుతుందని అన్నారు. ఐక్యరాజ్యసమితి, టర్కీ మధ్యవర్తిత్వంతో జరిగిన నల్ల సముద్రం ధాన్యం ఒప్పందం నుండి వైదొలగాలని రష్యా ప్రకటించిన వెంటనే భారత్ బియ్యం ఎగుమతులపై నిషేధం విధించింది. గతేడాది ప్రపంచవ్యాప్తంగా ధాన్యం సరఫరా అయ్యేందుకు నల్లసముద్రం ధాన్యం ఒప్పందం కీలకంగా పనిచేసిందని అన్నారు. ఉక్రెయిన్ నుండి ప్రపంచవ్యాప్తంగా 33 మిలియన్ టన్నుల ధాన్యం సరఫరా అయిందని అన్నారు. దీంతో అంతర్జాతీయంగా ధాన్యం ధరలు తగ్గాయని గౌరించస్ తెలిపారు. ప్రస్తుతం ఆ ఒప్పందం రద్దవడంతో పరిస్థితి తారుమారయ్యే ప్రమాదం ఉందని, ధాన్యం ధరలు సుమారు 10-15 శాతం పెరిగే అవకాశం ఉందని అంచనా వేశారు.

## ఎన్డీయేే బలం ఈడీ, సీబీఐ, ఐటీ: ఉద్ధవ్

ముంబై: ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్, ఆదాయపు పన్నుశాఖ, సీబీఐనే ఎన్డీయేకు బలమని శివసేన (యూబీటీ) అధ్యక్షుడు ఉద్ధవ్ ఠాక్రే విమర్శించారు. ఆ మూడు పార్టీలే నేషనల్ డెమొక్రటిక్ అలయెన్స్ (ఎన్డీయే)లో బలంగా ఉన్నవని ఎద్దేవా చేశారు. సామ్నా పత్రిక ఎగ్జిక్యూటివ్ ఎడిటర్, ఎంపీ సంజయ్ రౌత్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో కేంద్రంలోని మోదీ ప్రభుత్వాన్ని ఉద్ధవ్ దుయ్యబట్టారు. మణిపూర్‌లో హింసను ప్రస్తావిస్తూ ఈశాన్య రాష్ట్రాన్ని సందర్శించే సమయం కూడా ప్రధాని మోదీకి లేదని వ్యాఖ్యానించారు. 'ఎన్నికలు వచ్చినప్పుడు అధికారంలో ఉన్నది ఎన్డీయే ప్రభుత్వమని బీజేపీకి గుర్తుకొస్తుంది. ఎన్నికలు ముగిసిన తర్వాత అది మోదీ ప్రభుత్వమవుతుంది. ఎన్డీయేలో మొత్తం 36 పార్టీలు ఉన్నాయిగానీ సీబీఐ, ఈడీ, ఐటీ మాత్రమే అందులో బలంగా ఉన్నాయి. మిగతా పార్టీలు ఏమయ్యాయి? కొన్ని పార్టీలకు కనీసం ఒక్క ఎంపీ లేరు' అని ఉద్ధవ్ అన్నారు. ఉమ్మడి పౌరస్మృతి (యూసీసీ) గురించి మాట్లాడుతూ యూసీసీ తర్వాత ముందు కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు గోవధపై నిషేధానికి చట్టాన్ని బీజేపీ తేవాలన్నారు. చట్టానికి అంతా సమానమైనప్పుడు బీజేపీలోని అవినీతిపరులకూ శిక్ష పడాలని మహారాష్ట్ర మాజీ సీఎం డిమాండ్ చేశారు. ఠాక్రే కుటుంబం ఎక్కడుంటే 'నిజమైన శివసేన' అక్కడ ఉంటుందని నొక్కిచెప్పారు. శివసేనను చీల్చిన వారు దానిని అంతం చేయొచ్చని అనుకున్నారుగానీ పార్టీ ఆవిర్భవిస్తోందని ఉద్ధవ్ అన్నారు. ఈ చీలిక ఓ విధంగా పార్టీలోకి కొత్త రక్తాన్ని తెచ్చిందన్నారు. చాలా కాలంగా పార్టీలో తిష్టవేసిన సీనియర్లు లేకపోవడంతో యువ నేతలకు అవకాశం లభించిందని ఉద్ధవ్ ఠాక్రే తెలిపారు. ఏక్‌నాథ్ షిండే వర్గం తిరుగుబాటుతో గతేడాది జూన్‌లో శివసేన రెండుగా చీలిన విషయం విదితమే.

## దళితులపై నేరాలలో ఎంపీ టాప్

న్యూఢిల్లీ: మధ్యప్రదేశ్‌లో 2021లో దళితులపై అత్యధిక నేరాలు జరిగాయి. జాతీయ నేర రికార్డుల బ్యూరో (ఎన్‌సీఆర్‌బీ) విడుదల చేసిన సమాచారం ప్రకారం...2019లో రాజస్థాన్ మొదటి స్థానంలో ఉండగా, మధ్యప్రదేశ్ రెండో స్థానంలో నిలిచింది. 2021లో ఎస్సీలపై నేరాల విషయంలో జాతీయ సగటు రేటు 22.6 కాగా మధ్యప్రదేశ్‌లో 63.6గా నమోదైంది. రాజస్థాన్ 60.8 రేటులో రెండో స్థానంలో నిలిచింది. 2011 జనగణన ఆధారంగా ఎస్సీల జనాభాను లెక్కించారు. లక్ష మంది ఎస్సీ జనాభాపై జరిగిన నేరాలకు సంబంధించి రేటును లెక్కించారు. అన్ని రకాల నేరాలు, వేధింపులను దీనిలో చేర్చారు. ఎస్సీలపై జరిగిన నేరాల సంఖ్యకు సంబంధించి ఉత్తరప్రదేశ్ మొదటిస్థానంలో (9,492) ఉండగా రాజస్థాన్ (7,435), మధ్యప్రదేశ్ (7,211) తర్వాతి స్థానాలలో నిలిచాయి. ఎస్సీ, ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టం కింద 2011లో దేశంలో 45,619 కేసులు నమోదయ్యాయి. ఇక ఎస్టీలపై నేరాలకు సంబంధించి కేరళ మొదటి స్థానంలో నిలవగా రాజస్థాన్ రెండో స్థానంలో, మధ్యప్రదేశ్ మూడో స్థానంలో ఉన్నాయి. నేరాల సంఖ్య విషయానికి వస్తే మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఒడిశా మొదటి మూడు స్థానాలలో నిలిచాయి.

## ఐదు కోట్ల మంది ఉపాధి కూలీలపై వేటు

న్యూఢిల్లీ: ఐదు కోట్లకు పైగా ఉపాధి కూలీలను తొలగించినట్లు మోదీ ప్రభుత్వం పార్లమెంటులో వెల్లడించింది. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్) కింద 2022-23 ఆర్థిక సంవత్సరంలో ఐదు కోట్ల మందికి పైగా కార్మికులను తొలగించినట్లు తెలిపింది. కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి గిరిరాజ్ సింగ్ లోక్‌సభకు ఇచ్చిన లిఖితపూర్వక సమాధానంలో పేర్కొన్నారు. 2021-22తో పోలిస్తే 2022-23లో తొలగింపులు 247 శాతం పెరిగాయి. రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహించే సాధారణ వ్యాయామంలో భాగంగా ఈ తొలగింపులు జరిగినట్లు మంత్రి తన సమాధానంలో తెలిపారు. నకిలీ జాబ్ కార్డు, డూప్లికేట్ జాబ్ కార్డు, పనిచేయడానికి ఇష్టపడని వారు, గ్రామ పంచాయతీల నుండి శాశ్వతంగా బదిలీ అయిన కుటుంబాలు, జాబ్ కార్డ్‌లో ఒకే వ్యక్తి, గడువు ముగిసిన కార్డు, వ్యక్తి మరణించడం, గ్రామాలను పట్టణ పరిధిలోకి తీసుకురావడం వంటి కారణాలతో వారిని తొలగించినట్లు వివరించారు. అయితే ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్ జాబ్ కార్డులను ఆధార్ కార్డులతో లింక్ చేయడం, ఆధార్ ఆధారిత చెల్లింపుల వ్యవస్థ (ఏబీపీఎస్) కారణాలతో తొలగింపులు జరిగినట్లు వార్తలు వెలువడ్డాయి. ఈ ఏడాది జూన్ 23 వరకు 61 లక్షల మంది రిజిస్టర్డ్ కార్మికులను తొలగించారు. పైగా ఈ కార్యక్రమాన్ని సరిగ్గా అమలు చేయడం రాష్ట్ర ప్రభుత్వాల బాధ్యత అని సింగ్ పేర్కొనడం గమనార్హం. ఈ తొలగింపుల జాబితాలో పశ్చిమబెంగాల్ రాష్ట్రం(5,199 శాతం)తో మొదటి స్థానంలో ఉండగా, తర్వాత స్థానాల్లో వరుసగా తెలంగాణ (2727 శాతం), ఆంధ్రప్రదేశ్ (1147 శాతం), ఉత్తరప్రదేశ్ (466 శాతం), ఉత్తరాఖండ్ (427 శాతం ) రాష్ట్రాలు ఉన్నాయి. కాంగ్రెస్ సభ్యులు గౌరవ్ గొగోయ్, వీకే. శ్రీకందన్ అడిగిన ప్రశ్నకు మంత్రి ఈ సమాధానం చెప్పారు.

## అవసరమైతే నియంత్రణ రేఖ దాటతాం

### విజయ్ దివస్‌లో మంత్రి రాజ్‌నాథ్ సింగ్

ద్రాస్(లడ్డాక్): భారతదేశ గౌరవ ప్రతిష్ఠలను కాపాడుకోవడానికి నియంత్రణరేఖ దాటడానికి మరోసారి సిద్ధంగా ఉన్నామని, సైన్యానికి మద్దతు ఇచ్చేందుకు ప్రజలు కూడా సిద్ధంగా ఉండాలని కేంద్ర రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ పిలుపునిచ్చారు. ఆయన ద్రాస్‌లోని కార్గిల్ యుద్ధ స్మారకం వద్ద జరిగిన కార్యక్రమంలో పాల్గొన్నారు. దేశవ్యాప్తంగా కార్గిల్ విజయ్ దివస్‌ను బుధవారం జరుపుకున్నారు. పాకిస్తాన్ మనకు వెన్నుపోటు పొడిచిందని, అందుకు భారత్ యుద్ధం చేయాల్సి వచ్చిందని రాజ్‌నాథ్‌సింగ్ అన్నారు. దేశం కోసం ప్రాణాలు పణంగా పెట్టిన సైనికులకు వందనం చేస్తున్నానన్నారు. దేశం యుద్ధాన్ని ఎదుర్కోవాల్సిన పరిస్థితి నెలకొన్న ప్రతిసారీ ప్రజలు పరోక్షంగా మద్దతుగా నిలిచారన్నారు. యుద్ధ రంగంలో అవసరమైన చోట సైనికులకు నేరుగా మద్దతు ఇచ్చేందుకు ప్రజలు సిద్ధంగా ఉండాలని కోరుతున్నట్లు రాజ్‌నాథ్ చెప్పారు. దేశ గౌరవ ప్రతిష్ఠల కోసం తాము ఎందాకైనా వెళ్లడానికి సిద్ధమేనన్నారు. అవసరమైతే నియంత్రణ రేఖనూ దాటతామని హెచ్చరించారు. సైన్యం సరిహద్దులను కంటికి రెప్పలా కాపాడుతున్నంత సేపు శత్రువులకు ఇటువైపు కన్నెత్తి చూసే ధైర్యం ఉండదని రాజ్‌నాథ్ చెప్పారు. కేవలం కార్గిల్ యుద్ధంలోనే కాదు.. స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి అనేకమార్లు సైన్యం ధైర్యసాహసాలతో దేశం గర్వించేట్లు చేసిందన్నారు.

మరోవైపు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని నరేంద్ర మోదీ ట్విటర్ వేదికగా కార్గిల్ అమరవీరులకు నివాళులర్పించారు. సాయుధ దళాల అసాధారణ ధైర్య సాహసాలను ప్రజలు చిరకాలం గుర్తుంచుకొంటారని, భవిష్యత్తు తరాలకు వారి గాథలు స్ఫూర్తినిస్తాయని రాష్ట్రపతి పేర్కొన్నారు. 'కార్గిల్ విజయ్ దివస్ భారత వీరుల ధైర్యగాథను గుర్తుకు తెస్తుందని, వారు ప్రజలకు స్ఫూర్తిదాయకంగా నిలిచారని, వారికి హృదయ పూర్వక నివాళి అని ప్రధాని తన సందేశంలో పేర్కొన్నారు.

## మణిపూర్‌లో మళ్లీ విధ్వంసం

### ఇళ్లు, బస్సులకు నిప్పు పెట్టిన అల్లరిమూకలు

ఇంఫాల్ : మణిపూర్ రాష్ట్రంలో విధ్వంసకాండ కొనసాగుతూనే ఉంది. బుధవారం మోరే జిల్లాలోని మోరే బజార్ ప్రాంతంలో కొందరు దుండగులు సుమారు 30 ఇళ్లకు, దుకాణాలకు నిప్పు పెట్టారు. అయితే ఆ ఇళ్లలో ఎవరూ నివాసం ఉండటం లేదని తెలిసింది. పాడుబడ్డ ఇళ్లున్న ఈ ప్రదేశం మయన్మార్ సరిహద్దుకు సమీపంలో ఉంటుంది. ఇళ్ల దహనం తరువాత, భద్రతా దళాల మధ్య కాల్పులు కూడా జరిగాయి. ఏదైనా ప్రాణనష్టం జరిగిందా అనేది స్పష్టంగా తెలియలేదని అధికారులు తెలిపారు. కాంగ్‌పోక్పి జిల్లాలో మంగళవారం భద్రతా బలగాలు రవాణా కోసం వినియోగించే రెండు బస్సులను సైతం ఇలాగే అల్లరి మూకలు తగులబెట్టారు. సపోర్మీనా వద్ద ఈ ఘటన చోటు చేసుకుంది. మణిపూర్ రిజిస్ట్రేషన్‌తో ఉన్న ఆ బస్సులు దిమాపుర్ వైపు నుంచి వస్తుండగా... స్థానికులు వాటిని అడ్డుకున్నారు. బస్సుల్లోకి ఎక్కి ఇతర తెగ ప్రజలెవరైనా అందులో ఉన్నారా అని సోదాలు చేశారు. ఆ తరువాత వాటిని దహనం చేశారని అధికారులు పేర్కొన్నారు. ఈ రెండు ఘటనల్లో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. కాగా ఇంఫాల్‌లోని సజివా, తౌబాల్ జిల్లాలోని యైతిబి లౌకోల్‌లో తాత్కాలిక గృహాల నిర్మాణం పూర్తవుతున్నట్లు ముఖ్యమంత్రి ఎన్ బీరెన్ సింగ్ తెలిపారు. అతి త్వరలో సహాయక శిబిరాల్లో ఉంటున్న కుటుంబాలు ఈ ఇళ్లలోకి మారతారన్నారు. ఇటీవల హింసాత్మక ఘటనలకు ప్రభావితమైన ప్రజలకు పునరావాసం కల్పించడానికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని సింగ్ ట్విట్టర్‌లో తెలిపారు. ఈశాన్య రాష్ట్రమైన మణిపూర్‌లో దాదాపు మూడు నెలల క్రితం మైతేయి, కుకీ జాతుల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. అప్పటి నుంచి ఆ రాష్ట్రం రావణకాష్టంలా రగులుతోంది. వివిధ అల్లర్లలో సుమారు 160 మంది చనిపోయారు. వందల సంఖ్యలో గాయపడ్డారు. ఈ నేపథ్యంలోనే ఇంటర్నెట్ సేవలను నిలిపివేశారు. మొబైల్ రీఛార్జ్, ఎల్‌పీజీ సిలిండర్ బుకింగ్, కరెంటు బిల్లుల చెల్లింపు తదితర ఆన్‌లైన్ సేవలతోపాటు ఆఫీసులు, వర్క్ ఫ్రం హోం చేస్తున్నవారిపై ఇంటర్నెట్ నిషేధం ప్రభావం చూపుతోన్న కారణంగా కొన్ని షరతులతో బ్రాడ్‌బ్యాండ్ సేవలను హోంశాఖ మంగళవారం నుంచి పునరుద్ధరించింది.

## సీఐసీ వద్ద 19 వేల ఫిర్యాదులు, అభ్యర్థనలు

### కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ వెల్లడి

న్యూఢిల్లీ : ఏప్రిల్ 1వ తేదీ నాటికి కేంద్ర సమాచార కమిషన్ (సీఐసీ) వద్ద మొత్తం 19,233 ఫిర్యాదులు, అభ్యర్థనలు పెండింగ్‌లో ఉన్నాయని ప్రభుత్వం బుధవారం వెల్లడించింది. మంజూరైన పది మందికిగాను సమాచార కమిషనర్ పోస్టులు నాలుగు ఖాళీలు ఉన్నాయని కేంద్ర వ్యక్తిగత, సిబ్బంది వ్యవహారాల శాఖ సహాయ మంత్రి జితేంద్ర సింగ్ లోక్‌సభలో ఒక ప్రశ్నకు సమాధానంగా పేర్కొన్నారు. 2018-19 కాలంలో 29,655, 2019-20లో 35,178, 2020-21లో 38,116, 2021-22 కాలంలో 29,213 పెండింగ్‌లో ఉన్నాయని ఆయన తెలిపారు. సమాచార హక్కు చట్టం-2005కు చెందిన సెక్షన్ 12(3) ప్రకారం, కేంద్ర సమాచార కమిషన్ సమాచార ప్రధాన కమిషనర్లు, సమాచార కమిషనర్ల సంఖ్య 10కి మించకుండా నియమించవచ్చు. అయితే ప్రస్తుతం, సీఐసీలో సమాచార కమిషనర్ కాకుండా నలుగురు సమాచార కమిషనర్లు ఉన్నారని జితేంద్ర సింగ్ పేర్కొన్నారు. కాగా, రాష్ట్ర సమాచార కమిషన్లలో సమాచార కమిషనర్లకు చెందిన ఖాళీలను భర్తీ చేయడమనేది సమాచార హక్కు చట్టం సెక్షన్ 15 ప్రకారం ఆయా రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలోని అంశమని మంత్రి అన్నారు. ప్రజా సమాచార అధికారులు, ఫస్ట్ అప్పిలేట్ అథారిటీలకు 'శిక్షణ, మార్గదర్శకాలను జారీ చేయడం ద్వారా సామర్థ్యం పెంపొందించడం' వంటి అనేక చర్యలను ప్రభుత్వం తీసుకుంది. తద్వారా సమాచార కమిషన్‌కు తక్కువ సంఖ్యలో అప్పీళ్లను అందజేసేలా మొదటి అప్పీళ్లను సమర్థవంతంగా తొలగించే వీలు ఉంటుందని సింగ్ తెలిపారు. రెండవ అప్పీళ్ల విషయానికొస్తే, సీఐసీ చట్టం ప్రభావాన్ని మెరుగుపరచడానికి అనేక కార్యక్రమాలు చేపట్టిందని, రెండవ అప్పీళ్లు/ఫిర్యాదుల ముందస్తు విచారణ కోసం ఇ-కోర్టు, వీడియో కాన్ఫరెన్సింగ్ వంటివి చేపట్టిందని ఆయన పేర్కొన్నారు. కమిషన్ రికార్డుల డిజిటలైజేషన్, కేసుల ఎలక్ట్రానిక్ రసీదులు, నమోదు, ఆర్టీఐ దరఖాస్తుదారుల కోసం ఒక క్లిక్ ఇన్ఫర్మేషన్ విండో, మొబైల్ యాప్‌ను కూడా పూర్తి చేసిందని మంత్రి తెలిపారు.

## ప్రత్యక్ష ప్రసారంలో ఏడు హైకోర్టు కార్యకలాపాలు

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా ఏడు హైకోర్టుల్లో కార్యకలాపాల ప్రత్యక్ష ప్రసారం జరుగుతోందని కేంద్ర ప్రభుత్వం బుధవారం వెల్లడించింది. ఆ వ్యవహారాలు సంబంధిత హైకోర్టు పాలనాపరమైన అంశాల్లోకే వస్తాయని, అందులో కేంద్ర ప్రభుత్వ ప్రత్యక్ష పాత్ర ఏమీ ఉండదని తెలిపింది. కోర్టు వ్యవహారాలు ఆన్‌లైన్‌లో కొనసాగడం ఎంత అవసరమో కరోనా మహమ్మారి సమయంలో అర్థమైందని ప్రభుత్వం అభిప్రాయపడింది.

పార్లమెంటు వర్షాకాల సమావేశాల్లో భాగంగా రాజ్యసభ సభ్యుడు కేఆర్ సురేశ్‌రెడ్డి అడిగిన ప్రశ్నకు కేంద్ర న్యాయశాఖ ఈ సమాధానమిచ్చింది. 2023 జులై 17 నాటికి గుజరాత్, గువహతి, ఒడిశా, కర్నాటక, ఝార్ఖండ్, పాట్నా, మధ్యప్రదేశ్ హైకోర్టుల్లో ఇప్పటికే లైవ్ స్ట్రీమింగ్ మొదలైంది. మీడియాతోపాటు ఇతర ఔత్సాహిక వ్యక్తులు వీటిని వీక్షించవచ్చని కేంద్ర న్యాయశాఖ పేర్కొంది. న్యాయస్థానాల్లో మరింత పారదర్శకత తీసుకురావడంలో భాగంగా కోర్టు విచారణలను ప్రత్యక్ష ప్రసారం చేయాలని 'స్వప్నిల్ త్రిపాఠీ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా' కేసు సందర్భంగా భారత అత్యున్నత న్యాయస్థానం సూచించింది. ఇందుకు సంబంధించి విధివిధానాల రూపకల్పన కోసం సుప్రీం కోర్టు ఈ-కమిటీ చైర్‌పర్సన్ అధ్వర్యంలో ఓ సబ్ కమిటీ ఏర్పాటైంది. కమిటీ రూపొందించిన నిబంధనలను అమలు చేయాలని అన్ని హైకోర్టులకు సుప్రీంకోర్టు సూచించిందని కేంద్ర ప్రభుత్వం పేర్కొంది. మరోవైపు సుప్రీం కోర్టులోనూ గత సెప్టెంబరు 27 నుంచి రాజ్యాంగ ధర్మాసనం కేసుల విచారణను ప్రత్యక్ష ప్రసారం చేస్తున్న విషయం తెలిసిందే.

## చెన్నైలో జీ20 డీఆర్ఆర్ వర్కింగ్ గ్రూప్ భేటీ



చెన్నై: భారతదేశ జీ20 ప్రెసిడెన్సీలో భాగంగా మూడవ డిజాస్టర్ రిస్క్ రిడక్షన్ (డీఆర్ఆర్) వర్కింగ్ గ్రూప్ సమావేశం చెన్నైలో ఘనంగా ముగిసింది. మూడు రోజుల పాటు జరిగిన సమావేశం ముగింపు భేటీ బుధవారం జరిగింది. ఈ సమావేశం ప్రధాన దృష్టి విపత్తు-తట్టుకునే భవిష్యత్తు కోసం సహకారాన్ని ప్రోత్సహించడం. దీనితో పాటు, సమావేశంలో ముసాయిదా ప్రకటనపై చర్చలు జరిగాయి. నేషనల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ (ఎన్‌డిఎంఎ) విపత్తు రిస్క్ రిడక్షన్ వర్కింగ్ గ్రూప్ చైర్మన్, మెంబర్ సెక్రటరీ కమల్ కిశోర్ స్వాగత ప్రసంగం చేశారు. ప్రధానమంత్రి ప్రిన్సిపల్ సెక్రటరీ డా.పి.కె.మిశ్రా, జీ20 షెర్పా అమితాబ్ కాంత్, యుఎన్ డిజాస్టర్ రిస్క్ రిడక్షన్ చీఫ్ మామీ మిజుటోరి పాల్గొన్నారు. ట్రోయికా దేశాల (ఇండోనేషియా, ఇండియా, బ్రెజిల్) ప్రతినిధులు కూడా సెషన్లలో తమ అభిప్రాయాలను పంచుకున్నారు. సమావేశాన్ని ఉద్దేశించి ప్రధానమంత్రి ప్రిన్సిపల్ సెక్రటరీ మిశ్రా, విపత్తు ప్రమాద ప్రభావాలను తగ్గించడానికి జాతీయ, ప్రపంచ ప్రయత్నాల ప్రాముఖ్యతను నొక్కి చెప్పారు. అయితే, టర్కీలో భూకంపం, ఐరోపాలో వేడి తరంగాలు వేలాది మందిని చంపాయని, ఆఫ్రికాలో మిలియన్ల మంది ప్రజలు కరువు కారణంగా నీరు, వనరుల కొరతను ఎదుర్కొంటున్నారని ఆవేదన వెలిబుచ్చారు. ఈ సమస్యలన్నీ తమ విధానాలలో విపత్తు తగ్గింపు అంశానికి తక్షణ ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు.

## మన వాతావరణ అంచనా వ్యవస్థలు అద్భుతం

### మంత్రి కిరణ్ రిజిజు

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తోన్న వేళ భారత వాతావరణ శాఖ పనితీరుపై కేంద్ర భూ విజ్ఞానశాఖ మంత్రి కిరణ్ రిజిజు కీలక వ్యాఖ్యలు చేశారు. మన దేశంలో వాతావరణ పరిస్థితులను అంచనా వేసే వ్యవస్థలు కొన్నేళ్లుగా కచ్చితమైన ఫలితాలతో ప్రపంచ దేశాలకన్నా అత్యుత్తమంగా పనిచేస్తున్నాయని మంత్రి చెప్పారు. మనం విపత్తులను నిరోధించలేకపోయినప్పటికీ భారత వాతావరణ శాఖ జారీ చేసే హెచ్చరికలను పాటించడం ద్వారా తీవ్రతను తగ్గించే అవకాశం ఉంటుందని తెలిపారు. వాతావరణ మార్పుల నేపథ్యంలో ఐఎండీ పాత్ర అత్యంత కీలకంగా మారిందన్నారు. వాతావరణంలో మార్పులను కచ్చితంగా అంచనా వేయడంలో కీలక పాత్ర పోషించే డాప్లర్ రాడార్ల సంఖ్యను దాదాపు రెట్టింపు చేస్తామన్న మంత్రి రిజిజు... ప్రస్తుతం 35గా ఉన్న సంఖ్యను వచ్చే మూడేళ్లలో 68కి పెంచనున్నట్టు తెలిపారు. 2014 నుంచి ఐఎండీ అద్భుతంగా పనిచేస్తోందని, బిపర్‌జోయ్ వంటి తుపానులను కచ్చితంగా ట్రాక్ చేసిందని ప్రశంసించారు.

## అమిత్‌షా చెప్పేదొకటి...చేసేదొకటి: ఖర్గే

న్యూఢిల్లీ: మణిపూర్ అంశం పార్లమెంటును కుదిపేస్తోంది. దానిపై చర్చకు సిద్ధమేనని కేంద్రం చెబుతుండగా... ప్రధాని మోదీ ప్రకటన చేయాలని ప్రతిపక్షాలు పట్టుబడుతున్నాయి. దాంతో ఉభయ సభల్లో ప్రతిష్టంభన కొనసాగుతోంది. ఈ క్రమంలో ప్రతిపక్షాలు తమ విలువైన సహకారాన్ని అందించా లంటూ కేంద్ర హోంమంత్రి అమిత్ షా చేసిన అభ్యర్థనకు బదులుగా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే లేఖ రాశారు. అమిత్ షా మాటలకు, చేతలకు పొంతన ఉండదని విమర్శలు చేశారు. 'మీ దగ్గరి నుంచి వచ్చిన లేఖ వాస్తవరూపంలో ఉన్నది కాదు. అందులోని పదాలకు, మీ చేతలకు ఎంతో తేడా ఉంటుంది. ప్రభుత్వం అసహనంతో ఉంది. పార్లమెంట్‌లో దాని అభిప్రాయాలను రుద్దాలని చూస్తోంది. మణిపూర్‌పై ప్రధాని మోదీ ప్రకటన చేయాలని మేం కోరుతున్నాం. దాని తర్వాత చర్చ జరగాలి' అని ఖర్గే ఆ లేఖలో స్పష్టంచేశారు. కేంద్రం అసహనంతో ఇష్టానుసారంగా వ్యవహరిస్తోందని దుయ్యబట్టారు. ప్రతిపక్షాల డిమాండ్‌ను పునరుద్ఘాటించిన ఖర్గే... మణిపూర్‌పై ప్రధాని నరేంద్ర మోదీ వివరణాత్మక ప్రకటన చేయాలని తాము కోరుకుంటున్నామని, ఆ తర్వాత ఉభయ సభల్లో చర్చ జరగాలని అన్నారు. గత కొంతకాలంగా మణిపూర్‌లో జాతుల మధ్య వైరం నడుస్తోంది. ఈ క్రమంలో ఇద్దరు మహిళలపై జరిగిన అమానుష దాడికి సంబంధించిన వీడియో ఒకటి వైరల్ అయింది. అది దేశవ్యాప్తంగా తీవ్ర దుమారం రేపింది. ఇక మే నెల ప్రారంభం నుంచి అక్కడ జరుగుతోన్న ఘర్షణల్లో దాదాపు 150 మంది మృతి చెందారు.

# చంద్రం స్ఫూర్తితో జర్నలిస్టులు ముందుకు సాగాలి

## సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ

విశాలాంధ్ర-విజయవాడ: ప్రఖ్యాత పాత్రికేయులు మద్దుకూరి చంద్రశేఖరరావు స్ఫూర్తితో జర్నలిస్టులు ముందుకు సాగాలని సీపీఐ జాతీయ కార్యదర్శి కే నారాయణ పేర్కొన్నారు. స్వాతంత్ర్య సమర యోధులు, విశాలాంధ్ర వ్యవస్థాపక సంపాదకులు మద్దుకూరి చంద్రశేఖరరావు 49వ వర్ధంతి సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని 'మారుతున్న రాజకీయాలు- మీడియా పాత్ర' అనే అంశంపై స్మారకోపన్యాసం చేశారు. విశాలాంధ్ర సంపాదకులు ఆర్వీ రామారావు అధ్యక్షతన విజయవాడ చుట్టుగుంటలోని చంద్రం బిల్డింగ్స్‌లో బుధవారం ఈ కార్యక్రమం జరిగింది. నారాయణ మాట్లాడుతూ... జర్నలిస్టులు సూటిగా, స్పష్టంగా ఒక్క మాటతోనే సమాజంలో మార్పులు తీసుకురాగలరని చెప్పారు. రాజకీయాలకు, జర్నలిజానికి అవినాభావ సంబంధం ఉంటుందన్నారు. కుష్వంత్ సింగ్ అనే పాత్రికేయుడు రాసిన ఒక్క పదంతో ప్రభుత్వాలు, రాజకీయాల్లో మార్పులు జరిగాయని గుర్తు చేశారు. టీవీలు, ఇంటర్నెట్, సామాజిక మాధ్యమాలు వచ్చిన తరువాత వార్తలు వేగంగా ప్రజల్లోకి వెళుతున్నాయన్నారు. ప్రాంతీయ పార్టీలు వచ్చిన తరువాత రాజకీయ నీతి మారిపోయిందన్నారు. ప్రాంతీయ పార్టీలు భవిష్యత్ గురించి ఆలోచన చేయకుండా ప్రజల మనోభావాలను రాజకీయానికి వాడుకుంటున్నాయని చెప్పారు. తక్కువ సమయంలో లబ్ధిపొందాలనే ఆత్రుతతో వ్యవహరిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. గాట్ ఒప్పందం, డంకెల్ ప్రతిపాదనలకు వ్యతిరేకంగా తాను ఉద్యమంలో పాల్గొన్నందుకు దేశద్రోహం కేసు పెట్టారని గుర్తు చేశారు. ప్రపంచీకరణ, ఆటోమేషన్‌కు వ్యతిరేకంగా కమ్యూనిస్టు పార్టీలు పోరాటం చేసినా ప్రజలు ఆమోదిస్తున్నారని చెప్పారు. కులం, మతాలకు అతీతంగా రాజకీయాలుండాలని కమ్యూనిస్టులు కోరుతుంటే బీజేపీ వాటిని రాజకీయాలతో ముడిపెట్టిందన్నారు. బుర్జువా పార్టీలు మేనిఫెస్టోలు చక్కగా రూపొందిస్తారే గానీ వాటిని అమలు చేయరన్నారు. సమాజంలో ఆర్థికంగా, సాంస్కృతికంగా మార్పులు వచ్చాయని, సోషల్ మీడియా ప్రజల బలహీనతలపై కథనాలను వ్యాపింపజేస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్పొరేట్‌ల మాయాజాలంలో రాజకీయ పార్టీలు పడ్డాయన్నారు. దీంతో పార్టీలు హద్దులు దాటి ప్రమాదంలో చిక్కుకున్నాయని తెలిపారు. మణిపూర్ అల్లర్లకు అదానీయే కారణం అన్నారు. అటవీహక్కుల చట్టాన్ని మార్చే ప్రణాళికలో భాగంగానే ఆదివాసీ మహిళను రాష్ట్రపతి చేశారని స్పష్టం చేశారు. పెట్టుబడిదారి విధానాలకు విఘాతం కలిగినప్పుడు దాన్ని నివారించటానికి పథకాలు రచిస్తారని తెలిపారు. పాలకవర్గానికి రాజ్యాంగంపై నమ్మకం లేకపోవటంతో వ్యవస్థలను నాశనం చేస్తుందన్నారు. జర్నలిజంలో అతివాదులు, మితవాదులు, మాధ్యమిక పద్ధతులు వస్తున్నాయన్నారు. జర్నలిస్టులు విలువల్ని కాపాడుకుంటూ కచ్చితత్వంతో వ్యవహరించాలని సూచించారు. మద్దుకూరి చంద్రశేఖరరావు స్ఫూర్తితో జర్నలిస్టులు ముందుకు సాగాలన్నారు. సభకు అధ్యక్షత వహించిన విశాలాంధ్ర సంపాదకులు ఆర్వీ రామారావు మాట్లాడుతూ మద్దుకూరి చంద్రశేఖరరావు జాతీయోద్యమంలో పాల్గొన్నారని చెప్పారు. మొదటిసారి తెలుగులో కమ్యూనిస్టు పత్రికను నడిపారని, 'చంద్రం వ్యాసావళి', 'ఆంధ్ర సాహిత్య పునర్వికాసం' గ్రంథాలు రాశారన్నారు. విశాలాంధ్ర పత్రిక అన్ని వర్గాల ప్రజలు చదివేలా ఉంటుందన్నారు. ఈ సందర్భంగా కే నారాయణను శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. విశాలాంధ్ర ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ కూన అజయ్‌బాబు నిర్వహణలో జరిగిన ఈ కార్యక్రమంలో విశాలాంధ్ర విజ్ఞాన సమితి కార్యదర్శి, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్, కోశాధికారి జి.ఓబులేసు, జనరల్ మేనేజర్ పి.హరినాథరెడ్డి పాల్గొన్నారు. ముందుగా ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్య మండలి రాష్ట్ర అధ్యక్షులు చంద్రనాయక్, కోశాధికారి ఆర్. పిచ్చయ్య అభ్యుదయ గీతాలు ఆలపించారు.

# ఎంబీబీఎస్‌కు 10 శాతం ఫీజుల పెంపు

- ప్రభుత్వ ఉత్తర్వులు జారీ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ప్రస్తుత 2023-24 విద్యా సంవత్సరానికి రాష్ట్రంలోని ప్రైవేటు వైద్య, డెంటల్ కళాశాలల్లో ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సులకు ఫీజులు ఖరారు చేస్తూ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు ఉత్తర్వులిచ్చారు. హైకోర్టు తుది తీర్పునకు లోబడి ఫీజుల అమలు ఉంటుం దని పేర్కొన్నారు. 2022-23లో అమలైన ఫీజులపై 10 శాతం మేర పెంపుదల చేసి కొత్త ఫీజులను ఖరారు చేశారు. ఎంబీబీఎస్ కన్వనర్ కోటా ఫీజును రూ.16,500గా నిర్ణయించారు. బీ కేటగిరికి రూ.13.20 లక్షలు, సీ కేటగిరి (ఎన్ఆర్ఐ కోటా) కు రూ.39.60 లక్షలు చొప్పున ఫీజులు ఉన్నాయి. బీడీఎస్ కన్వనర్ కోటాకు రూ.14.300, బీ కేటగిరీకి రూ.4.40 లక్షలు, ఎన్ఆర్ఐ కోటాకు రూ.13.20 లక్షలు చొప్పున ఫీజు ఖరారు చేశారు. 2020లో ఖరారు చేసిన ఫీజుల ప్రకారం 2022-23 విద్యా సంవత్సరం వరకు ప్రవేశాలు చేపట్టారు. నీట్ యూజీ-2023లో ఏపీలో 42,836 మంది విద్యార్థులు అర్హత సాధించారు. ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల్లో ప్రవేశాలకు డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య వర్సిటీ ఇటీవల నోటిఫికేషన్ ఇచ్చింది. నీట్ యూజీ అర్హత సాధించినవారు దరఖాస్తు చేసుకుంటున్నారు. కాగా, ప్రైవేట్, అన్ ఎయిడెడ్ వ్యాయామ కళాశాలల్లో డీపీఈడీ, బీపీఈడీ, ఎంపీఈడీ కోర్సులకు ఉన్నత విద్య నియంత్రణ, పర్యవేక్షణ కమిషన్ సిఫారసుల మేరకు 2023-26 విద్యా సంవ్సతరానికి ఫీజులను ప్రభుత్వం ఖరారు చేసింది. కన్వనర్ కోటా కింద రెండేళ్ల కోర్సుల్లో భాగంగా డిప్లొమో (డీపీఈడీ) కు రూ.14 వేల నుంచి రూ.16 వేలు, బ్యాచలర్ (బీపీఈడీ) కు రూ.15 వేల నుంచి రూ.24,500, మాస్టర్స్ (ఎంపీఈడీ)కు రూ.25 వేల నుంచి రూ.35 వేల మధ్య ఆయా కళాశాలల్లోని వసతులు, విద్యా బోధనను బట్టి ఫీజులను నిర్ణయించింది.

# వక్ఫ్‌బోర్డుకు ఆ హక్కు లేదు

- మైనారిటీ వ్యవహారాలశాఖ మంత్రి స్మృతి ఇరానీ
- ఏపీ వక్ఫ్‌బోర్డు తీర్మానంపై వివరణ కోరామని వెల్లడి

న్యూఢిల్లీ: అహ్మదీయ సామాజిక వర్గాన్ని ముస్లిమేతరులుగా ఆంధ్రప్రదేశ్ వక్ఫ్‌బోర్డు తీర్మానం చేయడంపై దుమారం రేగుతున్న క్రమంలో ఒక వ్యక్తిని లేదా ఒక వర్గాన్ని మతం నుంచి బహిష్కరించే అధికారం దేశంలోని ఏ వక్ఫ్ బోర్డుకు లేదని కేంద్ర మైనారిటీ వ్యవహా రాల శాఖ మంత్రి స్మృతి ఇరానీ బుధవారం స్పష్టం చేశారు. ప్రముఖ ముస్లిం సంస్థ జమియాత్ ఉలేమా-ఎ-హింద్ మంగళవారం అహ్మదీయ సమాజంపై ఆంధ్రప్రదేశ్ వక్ఫ్ బోర్డు వైఖరిని సమర్థించింది. ఇది ముస్లింలందరి ఏకాభిప్రాయమని పేర్కొంది. ఈ అంశంపై ఇరానీని అడగ్గా... 'వక్ఫ్ బోర్డులన్నీ పార్లమెంటు చట్టం పరిధిలోకి వస్తాయని మాత్రమే చెప్పాలనుకుంటున్నాను. ఏ వక్ఫ్ బోర్డు పార్లమెంటు గౌరవానికి విరుద్ధంగా వ్యవహరించదు. దాని ద్వారా చేసిన చట్టాలను ఉల్లంఘించదు. దానికి ఏ వక్ఫ్ బోర్డు అనుమతి లేదు. ఫత్వాను ప్రభుత్వం ఉత్తర్వుగా మారుస్తుంది. పార్లమెంటు చట్టం ప్రకారం, ఒక వ్యక్తిని లేదా సమాజాన్ని ఒక మతం నుండి బహిష్కరించే అధికారం ఏ వక్ఫ్ బోర్డుకు లేదు. అహ్మదీయ వర్గం మైనారిటీ వ్యవహారాల మంత్రిత్వ శాఖకు చేసిన అభ్యర్థన మేరకు దీనిపై మేము ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నుంచి సమాధానం కోరాం. వాస్తవాలను నివేదించాలని ఆదేశించాం' అని ఇరానీ పార్లమెంటు వెలుపల విలేకరులతో అన్నారు. ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి స్పందన కోసం ఎదురుచూస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఆంధ్రప్రదేశ్ వక్ఫ్ బోర్డు నిర్ణయానికి జమియాత్ ఉలేమా-ఎ-హింద్ మద్దతు ఇవ్వడంపై ఇరానీని ప్రశ్నించగా... 'పార్లమెంటు చట్టాన్ని ఉల్లంఘించే అధికారం రాష్ట్రేతర సంస్థకు లేదు"అని ఇరానీ బదులిచ్చారు.

# విద్యుత్ ఉద్యోగుల సమస్యల్ని పరిష్కరించాలి

- ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓబులేసు
- ఆగస్టు17న విద్యుత్ సౌధ ముట్టడి
- సెప్టెంబరు 10 తర్వాత సమ్మెలోకి విద్యుత్ ఉద్యోగులు
- ఏపీ విద్యుత్ ట్రేడ్ యూనియన్స్ స్ట్రగుల్ కమిటీ పిలుపు

విశాలాంధ్ర-విజయవాడ: రాష్ట్రంలో విద్యుత్ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం తక్షణం పరిష్కరించాలని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు డిమాండ్ చేశారు. విజయవాడలోని ఎంబీ విజ్ఞాన కేంద్రంలో బుధవారం విద్యుత్‌రంగ ఉద్యోగుల సమస్యలపై ఏపీ విద్యుత్ ట్రేడ్ యూనియన్స్ స్ట్రగుల్ కమిటీ అధ్వర్యంలో భారీ సదస్సు జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఓబులేసు మాట్లాడుతూ...విద్యుత్ రంగ ఉద్యోగుల సమస్యల్ని యజమాన్యాలు, ప్రభుత్వం పూర్తి నిర్లక్ష్యం చేస్తున్నాయన్నారు. 85వేల మంది ఉద్యోగులు ఉండాల్సి ఉండగా కేవలం 50వేల ఉద్యోగులతో పనిచేయించుకుంటున్నారని తెలిపారు. దీంతో పనిభారం పెరిగి తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నా ప్రభుత్వం స్పందించడం లేదని విమర్శించారు. ఉద్యోగులకు కొత్త పీఆర్సీలోనైనా న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. నేషనల్ కో ఆర్డినేషన్ కమిటీ ఆఫ్ ఎలక్ట్రిసిటీ ఇంజనీర్స్ అండ్ ఎంప్లాయిస్ ప్రధాన కార్యదర్శి ప్రశాంత్ చౌదరి మాట్లాడుతూ విద్యుత్‌ను మార్కెట్ సరుకుగా మార్చే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల యత్నాలను ఉద్యోగులు తీవ్రంగా నిరసించాలని కోరారు. విద్యుత్ సంస్కరణలకు తీవ్ర ప్రతిఘటన రావడంతో దొడ్డిదారిన స్మార్ట్ మీటర్లను ప్రవేశపెడుతున్నాయని విమర్శించారు. స్మార్ట్ మీటర్లను ప్రవేశపెడితే విద్యుత్ రంగంలో మీటర్ రీడింగ్, బిల్లింగ్ చేసే ఉద్యోగులు వుండరని తెలిపారు. స్మార్ట్ మీటర్ల ద్వారా అదాని, అంబానీలకు రూ 2.06 లక్షల కోట్ల కాంట్రాక్టును కేంద్రం ఇస్తోందన్నారు. ఏడు వందలకు లభించే విద్యుత్ మీటర్ల స్థానే ఏడెనిమిది వేలు ఖర్చు చేసి స్మార్ట్ మీటర్లు ఎందుకు పెట్టుకోవాలో ప్రతి ఒక్కరూ ప్రశ్నించాలని కోరారు. విద్యుత్‌కు డిమాండ్ ఉన్న సమయంలో ఎక్కువ చార్జీలను వసూలు చేసేందుకే ఈ స్మార్ట్ మీటర్లను కేంద్రం ప్రవేశపెడుతోందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ఇటీవల యూనిట్ విద్యుత్‌కు రూ.17.80లు చెల్లించారని, ఆ రేటును రూ.50లకు తీసుకెళ్లేందుకు కూడా వెనుకాడరని అన్నారు. విద్యుత్ సంస్కరణలను దొడ్డిదారిన అమలు పరిచే ఈ స్మార్ట్ మీటర్లను ఉద్యోగులంతా ప్రతిఘటించాలని కోరారు. రాష్ట్రంలో ట్రాన్స్‌కో, జెన్కో డిస్కమ్‌లలో పనిచేస్తున్న ఉద్యోగులు, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆగస్ట్ 10 తర్వాత సమ్మెలోకి వెళ్లేందుకు సమాయత్తం కావాలని ఏపీ విద్యుత్ ట్రేడ్ యూనియన్స్ స్ట్రగుల్ కమిటి పిలుపునిచ్చింది. ఆగస్ట్ 17న విజయవాడలోని విద్యుత్ సౌధ ముట్టడికి భారీగా తరలి రావాలని పేర్కొంది. రాష్ట్రవ్యాప్తంగా కుండపోత వర్షాలు ఉన్నా, విద్యుత్ అధికారులు బెదిరింపులకు పాల్పడ్డా ఖాతరు చేయకుండా ఈ సదస్సుకు ఉద్యోగులు, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు భారీగా తరలి వచ్చారు. ఎంబీవీకే పరిసర ప్రాంతం అంతా విద్యుత్ ఉద్యోగులతో కిక్కిరిసింది. ఎంబీవీకే వద్ద ప్రభుత్వం భారీగా పోలీసులను మొహరించినా ఉద్యోగులు లెక్క చేయలేదు. ఏపీ విద్యుత్ ట్రేడ్ యూనియన్స్ స్ట్రగుల్ కమిటీ నాయకులు రామలింగారెడ్డి, సూరిబాబు, రాజశేఖర్, గంగయ్యలు సదస్సుకు అధ్యక్ష వర్గంగా వ్యవహరించారు. ఈ సందర్భంగా సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నర్సింగ్గారావు, ఏపీ విద్యుత్ ట్రేడ్ యూనియన్స్ స్ట్రగుల్ కమిటీ నాయకులు పి సుదర్శన్ రెడ్డి, వి.సుబ్బారెడ్డి, వి.శివయ్య, ఎం.బాలకాశి, కట్టా నాగరాజులు తదితరులు మాట్లాడారు. ఈ సదస్సులో రాష్ట్ర వ్యాప్తంగా ఏపీ విద్యుత్ ట్రేడ్ యూనియన్స్ స్ట్రగుల్ కమిటీ చేపట్టిన ఆందోళనా కార్యక్రమాలపై చేసిన తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ నెల 30న జిల్లా కేంద్రాలలో ఇతర ఉద్యోగ, కార్మిక సంఘాలతో రౌండ్ టేబుల్ సమావేశాలు, 31న అన్ని జిల్లాల కలెక్టర్లకు వినతి పత్రాలను ఇవ్వాలని కమిటీ తీర్మానించింది. అలాగే ఆగస్టు 2న అన్ని సర్కిల్ కార్యాలయాలు, ఉత్పాదక కేంద్రాల వద్ద, 7న తిరుపతిలోని ఏపీఎస్ పీడీసీఎల్ కార్యాలయం ముందు ధర్నాలు చేయాలని నిర్ణయించారు. 17న చలో విద్యుత్ సౌధను జయప్రదం చేయాలని కమిటీ కోరింది. అప్పటికీ ప్రభుత్వం స్పందించక పోతే సెప్టంబర్ 10 తర్వాత సమ్మెలోకి వెళ్లేందుకు సమాయత్తం కావాలని పిలుపునిచ్చింది.

# విపక్షాల ఆందోళన

- మణిపూర్‌పై చర్చకు పట్టు... ప్రధాని ప్రకటన చేయాలని డిమాండ్
- పార్లమెంటు ఉభయ సభలూ వాయిదా

న్యూఢిల్లీ : మణిపూర్ హింసాకాండపై విపక్షాల నిరసనలతో బుధవారం పార్లమెంటు ఉభయ సభలు వాయిదా పడ్డాయి. లోక్‌సభ, రాజ్యసభ బుధవారం ఉదయం 11 గంటలకు ప్రారంభమయ్యాయి. విపక్ష సభ్యుల నిరసనల మధ్యే ప్రశ్నోత్తరాలు కొనసాగాయి. లోక్‌సభ మధ్యాహ్నం 2 గంటలకు వాయిదా పడగా, రాజ్యసభ మధ్యాహ్నం 12 గంటల వరకు వాయిదా పడింది. లోక్‌సభలో మధ్యాహ్నం 12 గంటలకు మొదటి వాయిదా తర్వాత సభ సమావేశమైన పుడు, కాంగ్రెస్ ఎంపీ గౌరవ్ గొగోయ్ ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టారు. గందరగోళం మధ్య ఆరు బిల్లులను ప్రవేశపెట్టారు. కాంగ్రెస్, టీఎంసీ, డీఎంకే, జేడీ(యూ) తదితర పార్టీల సభ్యులు మణిపూర్ అంశంపై నినాదాలు చేస్తూ వెల్‌లోకి వెళ్లారు. లోక్‌సభలో ప్రభుత్వానికి అనుకూలంగా సంఖ్యలు ఉన్నాయని తమకు తెలుసునని, అయితే మణిపూర్‌లో హింసతో సహా వివిధ అంశాలపై ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నుంచి సమాధానం కోరేందుకు అవిశ్వాస తీర్మానం ఒక మార్గమని ప్రతిపక్ష ఎంపీలు అన్నారు. గందరగోళం కొనసాగడంతో సభను మధ్యాహ్నం 2 గంటలకు వాయిదా వేశారు. రాజస్థాన్‌కు చెందిన కొంతమంది బీజేపీ సభ్యులు రాష్ట్రంలో అవినీతి ఆరోపణలు చేస్తూ అశోక్ గెహ్లాట్ ప్రభుత్వాన్ని లక్ష్యంగా చేసుకుని రెడ్ డైరీలను చూపించడం కనిపించింది. పశ్చిమ బెంగాల్‌కు చెందిన బీజేపీ ఎంపీలు టీఎంసీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సభ చర్చకు అని స్పీకర్ ఓం బిర్లా పదేపదే సభను ఆర్డర్ చేయమని కోరగా, నిరసన వ్యక్తం చేసిన సభ్యులు తమ నినాదాలను కొనసాగించారు. గందరగోళం మధ్య, స్పీకర్ ప్రశ్నోత్తరాల సమయాన్ని అమలు చేయడానికి ప్రయత్నించినప్పటికీ ఫలించలేదు. అనంతరం సభను మధ్యాహ్నం 12 గంటలకు వాయిదా వేశారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.